

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :

janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 324 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 07-06-2025 | పేజీలు : 6


# 8 జిల్లాలతో 'విశాఖ ఎకనమిక్ రీజియన్'

- 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఎకానమీ
- మూలపేట - కాకినాడ మధ్య బీచ్ రహదారి అభివృద్ధి
- మరో ముంబైలా విశాఖను తీర్చిదిద్దేలా ప్రణాళికల అమలు
- 20 లక్షల మందికి 'వర్క్ ఫ్రమ్ హెూమ్' కార్యాచరణ
- నీతి ఆయోగ్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలని ఆదేశం

**అమరావతి, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** 'విశాఖ ఎకనమిక్ రీజియన్'ను ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దాలని.. 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపద సృష్టి ఈ రీజియన్ నుంచి జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. వచ్చే ఏడేళ్లలో విశాఖను మరో ముంబై నగరంలా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, ఏఎస్ఆర్, మన్యం.. మొత్తం 8 జిల్లాల పరిధిలో ఎకనమిక్ యాక్టివిటీ పెరిగేలా ప్రాజెక్టులు నెలకొల్పాలన్నారు. 8 జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. 36 వేల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం, 15.5 మిలియన్ జనాభా కలిగివున్న విశాఖ రీజియన్‌లో ప్రస్తుతం 49 బిలియన్ డాలర్ల జీడీడీపీ నమోదవుతోందని... 2032 నాటికి 20 నుంచి 24 లక్షల మేర ఉద్యోగాలు పెరిగేందుకు అవకాశం ఉండటంతో ఈ ప్రాంతం రాష్ట్ర పురోగతిలో కీలకం కానుందన్నారు.

**7 గ్రోత్ డ్రైవర్లు గుర్తింపు :**

శుక్రవారం సచివాలయంలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో 'విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్'గా అభివృద్ధి చేసే అంశంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 6 పోర్టులు, 7 మాన్యుఫాక్చరింగ్ నోడ్లు, 17 మేజర్ వ్యవసాయ క్షేత్రాలు, 6 సర్వీస్ హబ్స్, 12 పర్యాటక హబ్స్‌తో విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనిపై నీతి ఆయోగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోర్టు, ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, పట్టణీకరణ, మౌలికవసతుల కల్పన.. ఇలా 7 గ్రోత్ డ్రైవర్లుగా రూపొందించిన ప్రణాళికలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకోసం అత్యంత ప్రాధాన్యమైన 41 ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉందన్నారు.

**సాకారమైతే ఫలితాలు ఇలా :**

విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికలు అమలు చేయగలిగితే వచ్చే 7 ఏళ్లలో 7.5 లక్షల గృహాలు, 10,000 హెూటల్ రూములు, 20 వరకు ఇన్నోవేషన్ సెంటర్లు, 10 కాలేజీలు, 7,000 ఆస్పత్రి బెడ్స్, 20,000 హెక్టార్ల పరిధిలో పరిశ్రమలు, 80 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ సముదాయం, 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో గోదాములు అదనంగా సమకూరతాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

**సముద్ర తీరం - సంపద నిలయం :**

'మూలపేట-విశాఖపట్నం, విశాఖపట్నం-కాకినాడ మధ్య బీచ్ రహదారులు నిర్మిస్తాం. వీటిని జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తాం. సముద్ర తీరం సంపద నిలయం దానిని మరింత వినియోగించుకునేలా చూడాలి. పర్యాటకాన్ని పరిశ్రమగా గుర్తించాం, నూతన పాలసీ పెట్టుబడిదారులకు ఎంతో అనుకూలం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా యువతకు నిరంతరాయంగా నైపుణ్య శిక్షణ అందిస్తాం. వర్క్ ఫ్రమ్ హెూమ్ - నాలెడ్జ్ ఎకానమి అవుట్ సోర్సింగ్ విధానాలు అవలంభిస్తున్నాం. వర్క్ ఫ్రమ్ హెూమ్ కింద 20 లక్షల మందికి అవకాశం కల్పించాలని ప్రయత్నిస్తున్నాం.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**సమీక్షలో చర్చించిన మరికొన్ని అంశాలు :**

- దేశంలోని టాప్ 3 స్టీల్ పరిశ్రమలతో స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దడం... అలాగే పెట్రో కెమికల్స్, గ్యాస్ గ్రిడ్, పోర్టుల అభివృద్ధి, పెట్రోకెమికల్స్-మెడికల్ టెక్, షిప్ బిల్డింగ్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, క్లీన్ టెక్, లేబర్ ఇంటెన్సివ్ మాన్యుఫాక్చరింగ్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయం.
- వచ్చే 7 ఏళ్లలో ఐటీ రంగంలో కనీసం 4 నుంచి 5 లక్షల ఉద్యోగాల కల్పన జరిగేలా లక్ష్యం. డేటా సెంటర్లు, స్టార్టప్‌లు-ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడం.
- ప్రస్తుతం కొనసాగుతున్న 4 రైల్వే ప్రాజెక్టులతో పాటు అదనంగా 2032 కల్లా మరో 7 కొత్త రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయడం.
- మాన్యుఫాక్చరింగ్ నోడ్స్, పోర్టులకు అనుకూలించేలా కొత్తగా 9 రోడ్డు ప్రాజెక్టులు చేపట్టడం.
- 2028-30 కల్లా 77 కి.మీ. మేర నిర్మించే వైజాగ్ మెట్రో ప్రాజెక్టుపై చర్చించారు.



**ఏపీ విద్యుత్ సంస్కరణలు దేశానికే ఆదర్శం :**

'1998లో విద్యుత్ సంస్కరణలు దేశంలోనే తొలిసారిగా తీసుకువచ్చాం. 2014లో రెన్యువబుల్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇచ్చాం. ఇప్పుడు అదే అత్యంత చవకైన విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించింది. టెక్నాలజీ పరిధి పెరిగింది. దీనిని విద్యుత్ రంగంలో వినియోగించే అద్భుతాలు సాధించాం. ఇప్పుడు ప్రజలే ఉత్పత్తిదారులు - వినియోగదారులుగా చేసేలా నూతన విధానాలు అమలు చేస్తున్నాం. ఎవరి విద్యుత్ వాళ్లే ఉత్పత్తి చేసుకుంటే విద్యుత్ సరఫరా నష్టాలు అనేవి ఉండవు. ఈవీ వాహనాలకు అందరూ మళ్లితే రవాణా ఖర్చులు కూడా పూర్తిగా తగ్గిపోతాయి. సోలార్, విండ్ పవర్‌తో పాటు పంప్డ్ ఎనర్జీ, బ్యాటరీ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇందుకుతగ్గ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఆశయం నెరవేరేందుకు నీతి ఆయోగ్ సహకారం కూడా కోరుతున్నాను.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచేలా ప్రణాళికలు :

- ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ ట్రాన్సిషన్ రోడ్ మ్యాప్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - నీతి ఆయోగ్, ఐఎస్ఈజీ ఫౌండేషన్ మధ్య ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహనా ఒప్పందం కుదిరింది.
- ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 27.3 గిగావాట్లుగా ఉంది.
- రాష్ట్రంలో 2019లో 55.6 బిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ 2025 నాటికి 69.7 బి.యూ.కు చేరింది. ఇందులో పరిశ్రమలో రంగంలో 4.8 శాతం, గృహ వినియోగానికి 5.1 శాతం మేర డిమాండ్ పెరిగింది.
- వచ్చే ఏడాదికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 88.6 బి.యూ నుంచి 2035 నాటికి 163.9 బి.యూ. కు చేరుకోనుంది.
- ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 2029 నాటికి 78.50 గిగావాట్ల సోలార్ విద్యుత్, 35 గిగావాట్ల విండ్, పంప్డ్ స్టోరేజ్ 22 గిగావాట్లు, గ్రీన్ హైడ్రోజన్ 1.50ఎంఎంపీటీఏ, బ్యాటర్ స్టోరేజ్ 25 గిగావాట్లు, ఎథనాల్ 1,500 కెఎల్‌పీడీ, 5,000 ఈవీ చార్జింగ్ స్టేషన్లు, 10,000 టీపీడీ బయో సీఎన్జీ-సీబీజీ లక్ష్యం.
- క్లీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి ఇప్పటిదాకా రూ.5.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో 57.7 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది.

ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం, సీఎస్ విజయానంద్, ఐఎస్ఈజీ ఫౌండేషన్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏడేళ్ల తర్వాత విజయవంతంగా మెగా డిఎస్సీ చేపట్టాం

- పకడ్బందీగా పరీక్ష ప్రారంభించిన యంత్రాంగానికి అభినందనలు
- ఇకపై ప్రతిఏటా డిఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం
- పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కూడా ప్రారంభించాం
- మొట్టమొదటి సారిగా 4 వేల మందికి స్కూల్ అస్సిటెంట్లుగా పదోన్నతి
- నూరుశాతం అక్షరాస్యతకై ప్రాజెక్ట్ అ - ఆ (అక్షర ఆంధ్ర )
- విద్యాశాఖ అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష




**అమరావతి, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ చరిత్రలో తొలిసారిగా అత్యధికంగా 16,347 టీచర్ పోస్టులతో మెగా డిఎస్సీ చేపట్టామని, ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగిన అధ్యాయమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత విద్య, వయోజన విద్య, సమగ్రశిక్ష ఉన్నతాధికారులతో 4గంటలకు పైగా సుదీర్ఘంగా వివిధ అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఎటువంటి సమస్యలు తలెత్తకుండా డిఎస్సీ పరీక్ష ప్రక్రియను ప్రారంభించిన అధికారులను ఈ సందర్భంగా అభినందించారు. డిఎస్సీ పరీక్షకు తొలిరోజు ఉదయం 88శాతం, సాయంత్రం సెషన్ లో 86శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు తెలిపారు. అకడమిక్ క్యాలెండర్, లీప్ యాప్ కూడా సిద్ధం చేశామని చెప్పారు. ఇకపై ప్రతిఏటా డిఎస్సీ నిర్వహణ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసి విద్యాప్రమాణాలను మెరుగుపరుస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. అంతిమంగా రాబోయే నాలుగేళ్లలో ఎపి మోడల్ ఎడ్యుకేషన్ తేవడమే తమ లక్ష్యమన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను కూడా విజయవంతంగా ప్రారంభించామని తెలిపారు. 27వేల మందికిపైగా స్కూల్ అసిస్టెంట్ల బదిలీలను ఆన్ లైన్ విధానంలో పారదర్శకంగా చేపట్టాం. ఇదివరకెన్నడూ లేనివిధంగా 4వేలమందికి పైగా టీచర్లకు స్కూల్ అస్సిటెంట్లుగా ప్రమోషన్లు కూడా ఇస్తున్నామని తెలిపారు. ఎటువంటి రాజకీయజోక్యం లేకుండా టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ మేరకు పూర్తి పారదర్శకంగా బదిలీలు, ప్రమోషన్లు ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో నూరుశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా అక్షర ఆంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మంత్రి లోకేష్ చెప్పారు. రాష్ట్రంలో 15 - 59 సంవత్సరాల వయస్సు గలవారిలో ఇప్పటికీ 81లక్షలమంది నిరక్షరాస్యులుగా ఉండటంపై మంత్రి విస్మయం వ్యక్తంచేశారు. భారదేశంలోనే వయోజన విద్యలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగున ఉన్న నేపథ్యంలో ఇకపై మిషన్ మోడ్ లో వయోజన విద్యా కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. ఉల్లాస్ ప్రోగ్రామ్ లో భాగంగా ఈ ఏడాది మార్చిలో 3.95లక్షల మందికి అక్షరాస్యత పరీక్షలు నిర్వహించగా, 3.53లక్షల మంది (90.12%) మంది పాసయ్యారని తెలిపారు. వయోజన విద్యా విభాగంలో 247 పోస్టులకుగాను 109 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృతికా శుక్లా మంత్రి దృష్టికి తేగా, నూరుశాతం లక్ష్యాన్ని సాధించగలిగే అంకితభావం కలిగిన వారిని మాత్రమే పాఠశాల విద్యాశాఖ నుంచి తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడేళ్లలో అక్షరాస్యతలో టాప్-3 రాష్ట్రాల్లో ఒకటిగా

## త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

2లో..


## 19న అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన

2లో..



## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ : 06 జూన్ 2025,**

**తిథి : శుద్ధ దశమి (తె.02:21 వ.కు), శుద్ధ ఏకాదశి (07తా తె.04:52 వ.కు), నక్షత్రం : హస్త (ఉ.06:37వ.కు),**

**బ్రహ్మ ముహూర్తం : తె.04:01ల తె.04:49,**

**రాహుకాలం : ఉ.10:29ల మ.12:6,**

**యమగండం : మ.03:20ల మ.12:06,**

**వర్జ్యకాలం : మ.03:39 సా.05:40**

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ : 06 జూన్ 2025,**

**ఫజర్ : తెల్లవారుజామున గం. 04:30**

**సూర్యోదయం : ఉదయం గం. 05:49**

**జొహర్ : మధ్యాహ్నం గం. 12:19**

**అసర్ : సాయంత్రం గం. 03:43**

**మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:48**

**ఇష : రాత్రి గం. 08:07**





జన స్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# జీవితం కోసం ఆహారం - ఆరోగ్యం కోసం జీవితం

### నేడు ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం

నాగరికత ఎంత ముందుకు సాగుతున్నా సరైన పోషక ఆహారం లేనిదే మానవ మనుగడ కష్టం. వివిధ రకాల ఆహారపు అలవాట్లు సగటు మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కలుషిత ఆహారం, కాలుష్యం జనాభాను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుతున్న నేపథ్యంలో అందరికీ పోషక ఆహారం అందించడం ఒక సవాలుగా మారింది. ఆహార భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా జూన్ 7వ తేదీన జాతీయ ఆహార భద్రత దినోత్సవం జరుపుకుంటున్నాం. జీవితాన్ని నిలబెట్టుకోవడానికి మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి తగినంత మొత్తంలో సురక్షితమైన ఆహారాన్ని పొందడం కీలకం. ఆహారం ద్వారా సంక్రమించే వ్యాధులు సాధారణంగా అంటువ్యాధి లేదా విషపూరితమైనవి, తరచుగా కంటికి కనిపించవు, కలుషితమైన ఆహారం లేదా నీటి ద్వారా శరీరంలోకి ప్రవేశించే బ్యాక్టీరియా, వైరస్లు, పరాన్నజీవులు లేదా రసాయన పదార్థాల వల్ల ఇవి సంభవిస్తాయి. ఆహార గొలుసులోని ప్రతి దశలోనూ ఉత్పత్తి నుండి పంటకోత వరకు, ప్రాసెసింగ్, నిల్వ, పంపిణీ, తయారీ మరియు వినియోగం వరకు ఆహారం సురక్షితంగా ఉండేలా చూసుకోవడంలో ఆహార భద్రత కీలక పాత్ర పోషిస్తుంది. ఏటా 600 మిలియన్ల ఆహార సంబంధిత అనారోగ్య కేసులతో, అసురక్షిత ఆహారం మానవ ఆరోగ్యానికి ఆర్థిక వ్యవస్థలకు ముప్పుగా ఉంది, ఇది దుర్బలమైన, అణగారిన వర్గాల ప్రజలను, ముఖ్యంగా మహిళలు, పిల్లలను, సంఘర్షణతో ప్రభావితమైన జనాభాను వలసదారులను అసమానంగా ప్రభావితం చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 420 000 మంది కలుషితమైన ఆహారం తినడం వల్ల మరణిస్తున్నారని 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు ఆహార సంబంధిత వ్యాధుల భారంలో 40శాతం మోస్తున్నారని, ప్రతి సంవత్సరం 125000 మంది మరణిస్తున్నారని అంచనా. జూన్ 7న జరిగే ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం, ఆహార ప్రమాదా లను నివారించడం, గుర్తించడం నిర్వహించడం, ఆహార భద్రత, మానవ ఆరోగ్యం, ఆర్థిక శ్రేయస్సు, వ్యవసాయం, మార్కెట్ యాక్సెస్, పర్యాటకం స్థిరమైన అభివృద్ధికి దోహదపడటం వంటి చర్యలపై దృష్టిని ఆకర్షించడం, ప్రేరేపించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఐక్యరాజ్య సమితి ఆహార అలాగే వ్యవసాయ సంస్థ సభ్య దేశాలు ఇతర సంబంధిత సంస్థల సహకారంతో సంయుక్తంగా ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని



జరుపుకోవడానికి దోహదపడుతున్నాయి. మనం తినే ఆహారం సురక్షితంగా ఉండేలా, ప్రజా ఎజెండాలో ప్రధాన స్రవంతి ఆహార భద్రతను నిర్ధారించడానికి ప్రపంచవ్యాప్తంగా ఆహార సంబంధిత వ్యాధుల భారాన్ని తగ్గించడానికి ఈ అంతర్జాతీయ దినోత్సవం ఒక అవకాశం అని చెప్పవచ్చు.

**చరిత్ర :**
ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ ఆహార వ్యవసాయ సంస్థ 2019లో కలిసి ఈ దినోత్సవాన్ని ప్రారంభించాయి. 2018లో జాతీయ ఆహార భద్రతా దినోత్సవాన్ని యుఎన్ఓ ఆమోదించింది. దీని ప్రధాన ఉద్దేశ్యం – ఆహారంలో ఉండే ప్రమాదకరమైన పదార్థాలు, వ్యాధికారక సూక్ష్మజీవులు తదితరాల వలన కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడమే.

**దినోత్సవ లక్ష్యాలు :**
ఆహార భద్రతపై అవగాహన పెంపు – శుభ్రత, నిల్వ, తయారీ, పంపిణీ మార్గాల్లో ఏవైనా లోపాలు ఉంటే ప్రజారోగ్యానికి ప్రమాదం. ప్రతీ ఒక్కరిలో బాధ్యతా భావం పెంపు – కేవలం ప్రభుత్వాలే కాకుండా రైతులు, వ్యాపా

## ఎడిటోరియల్

రులు, వినియోగదారులు అందరూ ఆహార భద్రతకు బాధ్యత వహించాలి. సుస్థిర వ్యవసాయ విధానాల ప్రోత్సాహం – పర్యావరణ హానిలేని విధానాల్లో తయారు చేసిన ఆహారమే ఆరోగ్యానికి మేలైనది.

**ప్రాముఖ్యత :**
ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 60 కోట్ల మందికి పైగా కలుషిత ఆహారం వల్ల అనారోగ్యాలు వస్తున్నాయి. సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, తక్కువ ఇమ్యూనిటీ ఉన్నవారు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. ఈ దినోత్సవం ద్వారా సురక్షితమైన ఆహారం = ఆరోగ్యకరమైన జీవితం అనే సూత్రాన్ని అందరికీ వివరించడం జరుగుతుంది.

**మన భాగస్వామ్యం :**
స్వచ్ఛమైన నీటిని వాడటం, ఆహార పదార్థాలను సరిగ్గా ఉడికించటం తయారీ సమయంలో చేతులను శుభ్రంగా ఉంచటం నిల్వల సమయంలో సరైన ఉష్ణోగ్రతలు పాటించటం, దుర్వినియోగాన్ని నివారించటం

**ముగింపు :**
ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం కేవలం ఒక రోజు జరుపుకోవాల్సిన కార్యక్రమం మాత్రమే కాదు. ఇది మన జీవనశైలిలో భాగంగా మారాలి. ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం శుభ్రమైన, పోషకమైన ఆహారాన్ని అందరికీ అందించేందుకు మనం అందరం కలిసికట్టుగా పని చేయాలి. జీవితం కోసం ఆహారం కావాలి ఆరోగ్యమైన జీవితం కోసం భద్రమైన ఆహారం తీసుకోవాలి.



గజ్జల శేషారెడ్డి
సీనియర్ పాత్రికేయులు
పులివెందుల

## బీచ్ కబడ్డీ పోటీలకు జోష్

### మచిలీపట్నం బీచ్ క్రీడలకు హబ్‌గా మారనున్నదని మంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం బీచ్‌ను వాటర్ స్పోర్ట్స్‌కు కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం మచిలీపట్నం బీచ్‌లో జరుగుతున్న ముసులా బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా ఆయన మాట్లాడుతూ, బీచ్ క్రీడలకు మచిలీపట్నం అత్యంత అనుకూల ప్రదేశమని, ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. భవిష్యత్‌లో బీచ్ క్రీడలకు మచిలీపట్నం ప్రధాన కేంద్రంగా మారుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఫెస్టివల్‌లో భాగంగా గురువారం రాత్రి 7 గంటల నుండి అర్థరాత్రివరకు 12వ జాతీయ బీచ్ కబడ్డీ సీనియర్ పురుషులు, మహిళల పోటీలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ పోటీలకు దేశం నలు మూలల నుంచి మొత్తం 45 జట్లు (మహిళల విభాగంలో 22, పురుషుల విభాగంలో 23 జట్లు) హాజరయ్యాయి. బీచ్ కాంతుల్లో, మబ్బుల మధ్య జోరుగా సాగిన పోటీల్లో మొదటి రోజు లీగ్ మ్యాచ్‌ల్లో ఉత్కంఠభరిత పోటీలు నెలకొన్నాయి.

**మహిళల విభాగంలో :** ఉత్తరప్రదేశ్ బీహార్‌ను భారీ తేడాతో ఓడించగా, హర్యానా గోవాపై, ఆంధ్రప్రదేశ్ ఢిల్లీపై, హిమాచల్ ప్రదేశ్ విదర్భపై, పంజాబ్ పాండిచ్చేరిపై, తమిళనాడు ఉత్తరాంచల్‌పై, రాజస్థాన్ కర్ణాటకపై ఆధిపత్యం చెలాయించాయి. ఉత్కంఠత భరిత పోటీలో వెస్ట్ బెంగాల్ ఒక పాయింట్ తేడాతో తెలంగాణను ఓడించి సంచలనం సృష్టించింది.

**పురుషుల విభాగంలో :** కేరళ ఒడిశాపై, ఢిల్లీ విదర్భపై, మహారాష్ట్ర చత్తీస్‌గఢ్‌పై, హర్యానా జార్ఖండ్‌పై విజయం సాధించాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణపై గెలుపొందగా, ఉత్తరాఖండ్ కర్ణాటకపై, ఉత్తరప్రదేశ్ పాండిచ్చేరిపై, తమిళనాడు మధ్యప్రదేశ్‌పై విజయం సాధించి తమ ఆధిపత్యాన్ని చాటాయి. ప్రత్యర్థులపై ఆధిక్యాన్ని చూపుతూ పాయింట్ల తేడాలో విజయం సాధించిన జట్లు సెమీస్ వైపు దూసుకెళ్తున్నాయి.

బీచ్ కబడ్డీ పోటీలు మచిలీపట్నంలో క్రీడాప్రియులకు నిజమైన మేలి దృశ్యాలను అందిస్తున్నాయని, యువత ఈ వేదిక ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ఫెస్టివల్ ముగిసే వరకు ప్రతి రోజు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగనున్నాయని పేర్కొన్నారు.

## మోహినీ అవతారంలో శ్రీ గోవిందరాజస్వామి



**తిరుపతి, జూన్ 6 (జనస్వరం) :** నగరంలో శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన శుక్రవారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లకీపై మోహినీ స్వరూపంలో అభయమిచ్చిన స్వామివారిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పల్లకీ ఉత్సవం చెక్కభజనలు, కోలాటాలు, కేరళ కళాకారుల డ్రమ్స్, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పిస్తూ, స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మోహినీ అవతార వృత్తాంతం భాగవత పురాణంలో ప్రముఖంగా వర్ణించబడింది. సురాసురులు క్షీరసాగర మథనంలో పొందిన అమృతాన్ని పంచుకునే విషయంలో కలహం ఏర్పడిన సందర్భంలో శ్రీహరి మోహినీ రూపంలో అవతరించి అసురులను మోహింపజేసి సురులకు అమృతాన్ని పంచిన కథకు గుర్తుగా ఈ అవతారాన్ని ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాల్లో ప్రతిభింబిస్తున్నారు. అనంతరం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్వామివారికి, అమ్మవారికి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్ళతో అర్చకులు ప్రత్యేక అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, పలువురు ఆలయ అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం 6:45 గంటల నుంచి 8:30 వరకు మసీదులు, ఈద్గాహ్‌ల వద్ద 'ఈదుల్ అజ్‌హా' ప్రత్యేక నమాజును వేలాదిమంది ముస్లింలు ఆచరించనున్నారు. ఇందుకోసం మసీదులన్నీ ముస్తాబై ఉన్నాయి. త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగలో 'ఖుర్బానీ' చేసేందుకు జిల్లా ముస్లింలు సిద్ధమయ్యారు. నమాజు అనంతరం తమ తహతకు తగ్గట్లు గొర్రెలు వంటి వాటిని ఖుర్బానీ చేసి ఆ మాంసాన్ని పంచిపెట్టేందుకు పూర్తి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది బక్రీద్. ఇబ్రహీం అలైహిస్సలాం, ఆయన కుమారుడు ఇస్మాయిల్ అలైహిస్సలాం త్యాగస్మరణే సోమవారం ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఇదుల్ అజ్‌హా (బక్రీద్)ను జరుపుకుంటుంటారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 'జిల్‌హజ్' మాసం 10న ఈ పండుగను జరుపుకుంటారు. అదేరోజు పవిత్ర మక్కా నగరంలో 'హజ్' కూడా జరుగుతుంది.

**బక్రీద్ విశిష్టత.. :**
బక్రీద్ పండుగను ఈదుల్ అజ్‌హాగా పేర్కొంటారు. ఖుర్బానీ అంటే సమర్పణ, త్యాగం, బలి అని అర్థం. సుమారు 4వేల ఏళ్ల క్రితం ఇరాక్ దేశంలో పండిత కుటుంబంలో జన్మించిన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీంకు(సల్లల్లాహు అలైహి వసల్లం) ఒకరోజున



కల వచ్చింది. ఆ స్వప్నంలో 86 ఏళ్ల వృద్ధాప్యంలో జన్మించిన తన ఏకైక కుమారుడు ఇస్మాయిల్‌ను ఖుర్బానీ చేయాలని అల్లాహ్ ఆ కలలో ఇబ్రాహీంను ఆదేశించినట్లు కల సారాంశం. అల్లాహ్ ఆదేశానుసారం తన కుమారుడిని బలి ఇవ్వడం కోసం సిద్ధం కాగా అల్లాహ్ దాన్ని స్వీకరించి ఇస్మాయిల్‌కు బదులు స్వర్గం నుంచి ఓ పొట్టేలు (దుంబా)ను పంపి ఖుర్బానీ చేయడమే ఈ పండుగ ప్రత్యేకత.

**ఖుర్బానీ ప్రాముఖ్యత.. :**
ఇబ్రాహీం త్యాగానికి ప్రతిఫలంగా ప్రాప్తించిన ఈ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈదుల్ అజ్‌హా ప్రత్యేక నమాజు అనంతరం ఖుర్బానీ చేస్తారు. ఆర్థికంగా ఉన్నవారు ఒంటరిగా గొర్రె, మేకపోతులను దానం చేస్తారు. మధ్య తరగతి వారు ఏడుగురు కలిసి ఆవును, 13 మంది కలిసి ఒంటెను ఖుర్బానీ చేసి మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒకటి పేదలకు, మరొకటి బంధువులకు ఇస్తారు. ఇంకో వాటాను తమ ఇంటికి ఉపయోగించుకుంటారు.

**మానవులంతా ఒక్కటేనని నమ్మాలి :**
బక్రీద్ పండుగ అనేది త్యాగానికి ప్రతీక. ఖుర్బానీ అంటే జంతు బలి కాదు, మానవుడు దైవమార్గంలో తన సర్వస్వాన్ని త్యజిస్తానని చేసే ప్రకటన మాత్రమే. దైవాన్ని విశ్వసించడం, మానవులంతా ఒకటేనని నమ్మాలి. చెడును నిరోధించడం, మంచిని పెంచడం, కష్టాలలో సహనం వహిస్తూ, త్యాగ నిరతిని చూపించాలన్న సందేశమే ఖుర్బానీలో దాగి ఉంది.



**వ్యాస రచయిత :**
**సయ్యద్ ఫయాజ్ ఫాసిల్**
**ఎన్టీఆర్, కృష్ణ జిల్లాల బ్యూరో,**
**జనస్వరం.**

# 19న అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన

- **డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరి చేతుల మీదుగా శంకుస్థాపన**
- **మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**
- **అఖండ గోదావరి ప్రాజెక్టుతో గోదావరి పరిసర ప్రాంతాల్లో కొత్త సొబగులు**
- **మంత్రి కందుల దుర్గేష్**
- **సరికొత్తగా దర్శనమివ్వనున్న హేవలాక్ వంతెన, కడియం నర్సరీలు, నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయం**
- **చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని తెలిపేలా ఏర్పాట్లు, సందర్శకులకు మెరుగైన వసతుల కల్పన**
- **రాష్ట్రాన్ని పర్యాటక ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేసిన మంత్రి దుర్గేష్**



**అమరావతి/రాజమహేంద్రవరం, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కేంద్ర ప్రభుత్వ సహకారంతో మంజూరైన ప్రతిష్టాత్మక అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు జూన్ 19న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరిలు శంకుస్థాపన చేయనున్నారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం వెల్లడించారు. సాస్కి -2024-25 (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్) స్కీమ్ ద్వారా మంజూరైన రూ.97 కోట్లతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు జరగనున్నాయని మంత్రి చెప్పారు. పవిత్ర గోదావరి పుష్కరాలలోపే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. తద్వారా గోదావరి పరిసర ప్రాంతాలు సరికొత్త సొబగులు సంతరించుకోనున్నాయని, చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని తెలిపేలా సందర్శకులకు మెరుగైన వసతుల కల్పనతో పాటు మంచి అనుభూతిని అందిస్తామని మంత్రి దుర్గేష్ వివరించారు. 127 ఏళ్ల చరిత్ర గలిగి వారసత్వ సంపదకు ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జిని ఆధునీకీకరిస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. హేవలాక్ వంతెన ప్రాంతంలో జలపాతాలు, గ్లాస్ వంతెనలు, గేమింగ్ జోన్, స్పేస్ థీమ్, అర్బన్ హాట్ క్రాఫ్ట్ బజార్, హ్యాంగింగ్ గార్డెన్స్, హోలోగ్రామ్ జూ, టైమ్ ట్రావెల్, రైల్ మ్యూజియం, ఆక్వేరియం టన్నెల్‌లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయనున్నామని వివరించారు. హేవలాక్ వంతెన పక్కనే ఉన్న పుష్కర్ ఘాట్‌ను మరింతగా అభివృద్ధి చేసి అధ్యాత్మిక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామని మంత్రి పేర్కొన్నారు. హేవలాక్ వంతెన, పుష్కర్ ఘాట్ రెండింటిని అనుసంధానించి డైనమిక్ టూరిస్ట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దాలని భావిస్తున్నామన్నారు. పుష్కరాల రేవులో ఏడాది పొడవునా పవిత్ర స్నానాలు ఆచరించేలా, అధ్యాత్మికత స్ఫురించేలా, మరింత అధ్యాత్మికత ఉట్టిపడేలా చుట్టూ ఉన్న ఆలయాలను ఆర్కిటెక్చరల్, డిజైన్‌లతో సౌందర్యవంతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. భారతదేశపు అతి పెద్ద నర్సరీలో ఒకటైన కడియం నర్సరీకి పర్యాటక శోభ తెచ్చి సమీపంలోని గోదావరి కాలువ తదితర చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలకు పూర్వ వైభవం తేవాలని భావిస్తున్నామని మంత్రి దుర్గేష్ వివరించారు. గోదావరి చుట్టు ప్రక్కల పర్యాటకులు ఆహ్లాదంగా సేద తీరేలా, ప్రశాంతమైన వాతావరణాన్ని ఆస్వాదించేలా, కాలువలో పడవపై షికారు చేసే విధంగా తీర్చిదిద్దనున్నామన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా విశిష్టమైన చారిత్రక నేపథ్యం కలిగి, అద్భుతమైన ప్రాకారాలు, ఆకట్టుకునే ముఖ ద్వారం, ఎత్తైన రాజగోపురంతో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో అలరారుతున్న ప్రముఖ మహిమాన్విత ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ కోట సత్తెమ్మ దేవాలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దనున్నామన్నారు. అదనపు యాత్రికుల వసతి గృహాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఆలయ రాజ గోపురం ఆధునికీకరించనున్నామని వివరించారు.

# జగన్ రెడ్డి అరాచకాలే రాష్ట్ర ఖజానా దివాలాకు కారణం

### టీడీపీ అధికార ప్రతినిధి వెంకటీల వ్యాఖ్య

**చిత్తూరు, జూన్ 6 (జనస్వరం) :** గతంలో నేరస్తులకు మతం, కులం, రాజకీయ రంగులు పులుముతూ రాష్ట్రాన్ని అరాచక పాలనలోకి నెట్టిన వైఎస్ జగన్ రెడ్డి వల్లే ఆంధ్రప్రదేశ్ ఖజానా పూర్తిగా దివాళా తీయాల్సి వచ్చిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటీల సురేంద్ర కుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆయన చిత్తూరులో జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యాన్ని అవమానించిన విధంగా ఉందని విమర్శించారు. గంజాయి మాఫియా, రౌడీయిజాన్ని ప్రోత్సహించిన జగన్ రెడ్డి నేరస్థుల ఇళ్లకు వెళ్లి వారిని ప్రోత్సహించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. 2019 నుంచి 2024 వరకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చని జగన్ ఇప్పుడు కూటమి హామీలపై వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల రుణభారం మోపబడిందని, ప్రతి ఏడాది రూ.60 వేల కోట్ల వడ్డీలు, వాయిదాలు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అంతేకాకుండా రూ.1.40 లక్షల కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టి వెళ్లిన వైసీపీ దుశాసన పాలన వల్లే ఆర్థికంగా రాష్ట్రం కుదేలైందని వివరించారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవం, పరిపాలనా ప్రతిభతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం ఏడాదిలోనే 700కు పైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేసిందని తెలిపారు. సురేంద్ర కుమార్ చెప్పిన వివరాల ప్రకారం, పింఛన్ విషయంలో దేశంలోనే అత్యధికంగా రూ.4 వేల పింఛన్ అందజేస్తున్న ఘనత చంద్రబాబుదేనని అన్నారు. వైసీపీ ఐదేళ్లలో కేవలం రూ.1,000 పెంచితే, కూటమి ప్రభుత్వం మొదటి నెలలోనే రూ.2,834 పెంచి రూ.4,000కి చేర్చిందన్నారు.



అదే విధంగా సూపర్ సిక్స్ హామీలలో భాగంగా దీపం-2 పథకం ద్వారా 93 లక్షల మంది మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. గ్యాస్ కంపెనీలకు ముందుగానే చెల్లింపులు జరిపామని, నిబద్ధతతో పథకాన్ని అమలుచేస్తున్నామని వివరించారు. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా 204 క్యాంటీన్ల ద్వారా లక్షలాది మంది పేద, బడుగు, కార్మిక వర్గాలకు నిత్యాహారం అందించామని చెప్పారు. ఉపాధ్యాయ నియామకాల్లో విప్లవాత్మకంగా 16,347 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం చంద్రబాబే సాధించారని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని ధ్వజమెత్తారు. రైతులకు మద్దతుగా ఖరీఫ్, రబీ సీజన్లలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించి, కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రూ.13 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఇందులో జగన్ ప్రభుత్వం చెల్లించిన రూ.1,674 కోట్లు కూడా ఉన్నాయని వివరించారు. ఈ విధంగా అన్నదాతకు నిజమైన గౌరవం ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పెట్టుబడుల పరంగా చూస్తే, కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ. 9.40 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, ఆరు లక్షల ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను కల్పించగలిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరక మద్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా కిడ్నీ, లివర్, మానసిక రోగులు రెట్టింపు కాగా, ఆసుపత్రుల రికార్డులే దీనికి సాక్ష్యమన్నారు. తదుపరి తన అభిప్రాయాల్లో ఆయన తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, ఉపాధి హామీ, నీరు చెట్టు వంటి పథకాలపై వైసీపీ ప్రభుత్వం వేసిన రూ.24 వేల కోట్ల బకాయిలు ఇప్పటికే చెల్లించామని, ఉపాధి హామీ, నీరు చెట్టు పథకాలకు రూ.363 కోట్ల చెల్లింపులు చేసినట్లు వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వంతో సంపర్కం ద్వారా కీలక నిధులను సాధించగలిగామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,157 కోట్లు, ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, విశాఖ ఉక్కు పరిరక్షణకు రూ.11 వేల కోట్లు, విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి ప్రధాని మోదీ చేతులమీదుగా శంకుస్థాపన జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు వైసీపీ నాయకుల మాయమాటలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా వాస్తవాలను గుర్తించి కూటమి ప్రభుత్వానికి మద్దతు కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం సంకల్పబలంతో పాలనను ముందుకు తీసుకెళ్తోందని, ప్రజల భవిష్యత్తు కోసం ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తుందని వెంకటీల సురేంద్ర కుమార్ స్పష్టం చేశారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



**ముధోల్, జూన్ 6 (జనస్వరం) :** మండలంలోని బోరిగాం గ్రామంలో అధికార అనుమతులు లేకుండానే బుద్ధ విగ్రహాన్ని తొలగించిన ఘటనపై నిరసన కొనసాగుతోంది. అదే స్థలంలో బుద్ధ విగ్రహాన్ని పునఃస్థాపించాలని డిమాండ్ చేస్తూ బుద్ధ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ సభ్యులు భైంసాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్ష గురువారం పదకొండవ రోజుకు చేరుకుంది. కమిటీ అధ్యక్షుడు హస్డే దేవదాస్ మాట్లాడుతూ పదకొండ రోజులుగా దీక్ష కొనసాగుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి ఘటనలో అంబేద్కర్ విగ్రహం రిస్టులు ధ్వంసం చేయడంతో పాటు దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని, అలాగే హత్యాచారం అభి యోగాలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే స్థలంలో ప్రభుత్వం రెండు ఎకరాల భూమిని కేటాయించి బుద్ధ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాల్సిందిగా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ నిరసన కార్యక్రమంలో కమిటీ సలహాదారులు జంగ్మే గిరిధర్, కమిటీ జనరల్ సెక్రటరీ హాట్టే రావ్ లక్ష్మణ్, ట్రెజరర్ రాజారాం దాసరి, బీఎస్ఐ ఉత్తర తెలంగాణ పర్యాటక శాఖ ఉపాధ్యక్షులు ఆనంద్ రావు బోతే, కోతుల్‌గాం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి





**బొంరాస్‌పేట, జూన్ 6 (జనస్వరం) :** మండలంలో చేపడుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మండలంలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్ల పనులను అదేవిధంగా వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా బుర్రి తాండ నుండి బొమ్మ రాస్ పేట వరకు వయా మెట్లకుంట ద్వారా నిర్మించే రోడ్డు, టేకుల గడ్డ తాండ నుండి దారూరు మండలం గురుదొట్ల గ్రామం వరకు, సలిందాపూర్ జెడ్పి రోడ్డు వయా మాలకుంట నుండి ముద్దాయి పేట్ వరకు కలెక్టర్ పరిశీలించారు. జాతీయ రహదారి నుండి చౌదర్ పల్లి రోడ్డు, కొత్తూరు నుండి దేవనూర్, బొమ్మరాజు పేట్ మండల కేంద్రానికి రోడ్డు మార్గమధ్యలో నిర్మిస్తున్న కల్వర్టు పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. అదేవిధంగా బురాన్ పూర్ లో నిర్మించే ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులను పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. మండలంలో చేపట్టే పనులను నాణ్యవంతంగా చేపట్టే విధంగా అధికారుల పర్యవేక్షణతో పాటు వేగవంతంగా అభివృద్ధి పనులను చేపట్టే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## టింబర్ డిపోలో అగ్నిప్రమాదం


### బాధితులను పరామర్శించిన జనసేన నేత శ్రీనివాస రాజు



**రాజంపేట, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పట్టణంలో జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఉమ్మడి కడప జిల్లా రాజంపేట నియోజకవర్గానికి చెందిన రాజంపేట అర్బన్‌లోని ఎస్.ఆర్ కళ్యాణ మండపం సమీపంలో ఉన్న అన్నమయ్య టింబర్ డిపో నిన్న రాత్రి అగ్నిప్రమాదానికి గురైంది. భారీగా మంటలు చెలరేగి డిపోలో ఉన్న సుదీర్ఘకాలంగా నిల్వ ఉంచిన సరుకులు మంటల్లో కాలిపోయాయి. దీనితో యజమాని పెమ్మనబోయిన హరికృష్ణకు తీవ్ర ఆర్థిక నష్టం సంభవించింది. విషయం తెలిసిన వెంటనే రాజంపేట పార్లమెంటుకు జనసేన పార్టీ ఇంచార్జ్ అయిన యల్లటూరు శ్రీనివాస రాజు శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన డిపోను పరిశీలించి యజమానిని పరామర్శించారు. "ఇంత పెద్ద ప్రమాదం జరగడం బాధాకరం. బాధితులకు న్యాయం జరగేందుకు సంబంధిత అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి సహాయపడతాను" అని హరికృష్ణకు భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పట్ల స్పందనతో పాటు సహానుభూతితో ముందడుగు వేస్తున్న జనసేన నాయకుడి చర్యపై స్థానికులు అభినందన వ్యక్తం చేశారు. కాగా, అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## న్యాయవ్యవస్థను మరిచిన పోలీసు వ్యవస్థ

- హోం మంత్రి ఎవరన్న స్పష్టతపై సీఎం వివరణ ఇవ్వాలి
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్



**పెందుర్తి, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దిగజారుతోందని, పోలీసులే న్యాయ వ్యవస్థను దాటి శిక్షలు విధించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ విమర్శించారు. సోమవారం పెందుర్తి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తెనాలిలో యువకులను బహిరంగంగా రోడ్డుపై కూర్చో బెట్టి చితకబాదిన దృశ్యాలపై స్పందించిన ఆయన, ఎంతటి తప్పు చేసినా న్యాయ ప్రక్రియను పాటించకుండా పోలీసులే శిక్ష విధించడం అత్యంత అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. "పోలీసులు చట్టాన్ని అమలు చేయాల్సినవారు. కానీ వారు స్వయంగా చట్టాన్ని ఉల్లంఘించి నడిరోడ్డు మీద శిక్షలు విధిస్తే, న్యాయస్థానాల అవసరం ఏమిటి?" అంటూ ప్రశ్నించారు. బాధితుల ఇళ్లలో పెళ్లి కావాల్సిన ఆడపిల్లలు ఉన్నారని, వారి గౌరవం దెబ్బతీసేలా పోలీసులు వ్యవహరించారని ఆరోపించారు. అలాంటి కుటుంబాలను ఎవరు ఆమోదిస్తారు? అలాంటి వధువులను వివాహానికి అంగీకరించేందుకు ఎవరు ముందుకు వస్తారు? అని ప్రశ్నించారు. ఈ చర్యలను సమర్థించిన హోం మంత్రి వంగలపూడి అనిత స్వయంగా ఒక తల్లైనప్పటికీ, ఇతర మహిళల గౌరవాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. "పోలీసు శాఖ సామాన్యులకు రక్షణ కల్పించలేకపోతే... జూన్ 21న విశాఖపట్నం వస్తున్న ప్రధానికి భద్రత కల్పించగలరా?" అని ప్రశ్నించారు. ఆయన ఆరోపించిన విషయం ఏమంటే... టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అనుచరులు వంద మందికి పైగా తన పై దాడి చేసినా గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేసిన తర్వాత కూడా కేసు నమోదు చేయలేదని, పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని తెలిపారు. ఇక హోం మంత్రి వ్యవహారంపై కూడా బి.వి.రామ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం హోం మంత్రి ఎవరు అనే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి వంగలపూడి అనిత హోం మంత్రిగా ఉన్నారని భావిస్తున్నా, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ అనుచరులు తన నాయకుడే కాబోయే హోం మంత్రి అంటూ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. "ఇప్పటికే మాఫియాలా వ్యవ హరిస్తున్న పల్లా అనుచరుల చేతుల్లో హోం మంత్రిత్వ శాఖ ఉంటే రాష్ట్రం అరాచకంగా మారిపోతుంది" అని హెచ్చరించారు.

## తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకాలు త్వరలో ప్రారంభం



**పుట్టపర్తి, జూన్ 5 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు నడిపిస్తున్న సీఎం చంద్రబాబు నాయకత్వంలో కోలిషన్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో వేగం పెంచిందని, ముఖ్యంగా 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ', మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ముఖ్యమైన సంక్షేమ పథకాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండలంలోని ఎస్ఎల్వి ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ శుభకార్యానికి హాజరైన ఆమె, గూడా చలపతి కుమార్తె వివాహంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆమడగూరు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కోనపల్లి వారి కుటుంబం నిర్వహించిన వివాహ మహోత్సవంలో పాల్గొని లవన్ కుమార్ రెడ్డి, శ్వేత దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఒకదానికొకటి అమలు చేస్తున్నాం. లోటు బడ్జెట్ పరిస్థితుల్లోనైనా సమర్థవంతమైన పాలన అందించడమే మా లక్ష్యం. విషం చిమ్మే వైసీపీ నేతల మాటలు ప్రజలు నమ్మవద్దు," అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కొత్తచెరువు మండల కన్వీనర్ ఒలికి శ్రీనివాసులు, బుక్కపట్నం మండల కన్వీనర్ మల్ రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి గంగాద్రి, సత్యసాయి జిల్లా టీడీపీ కార్యదర్శి సాంకోట ఆదినారాయణ, గూడా సోము, సమ్మిటి చంద్ర, దరిద్రం మండల నేతలు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు. వివాహ వేడుకల్లో పాల్గొంటూనే ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, ప్రభుత్వ సంకల్పాన్ని తెలియజేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజలకు అభిమానం మరింత పెంచింది.

## నాణ్యమైన విద్యను అందించాలి



**పులివెందుల, జూన్ 6 (జనస్వరం) :** ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, అలాగే కళాశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ కార్యదర్శి బాలం సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలలు కళాశాలలో విద్యను బోధించేందుకు అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులను నియమించాలన్నారు. అదే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. విద్యార్థుల పురోభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను చేపట్టాలన్నారు. ఆ దిశగా ఈ ఏడాది ప్రారంభం కానున్న విద్యాసంవత్సరంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

## ఉద్యోగుల సంక్షేమానికి బాసటగా ప్రస్తుత ప్రజా ప్రభుత్వం

### జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి



**హైదరాబాద్, జూన్ 6 (జనస్వరం) :** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు నిజమైన బాసటగా నిలుస్తోందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాంపల్లి సీసీఎల్ఏ కార్యాలయ ప్రాంగణంలోని డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా ఉండటం సంతోషదాయకమని హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టిందని తెలిపారు. గురువారం రాష్ట్ర కాబినెట్ తీసుకున్న కీలక నిర్ణయాల్లో భాగంగా రెండు డీఏల చెల్లింపు, పెండింగ్ బిల్లులకు ప్రతి నెల రూ.700 కోట్లు విడుదల, ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులకు స్వస్థలాల్లో పదవీ నిర్వహణకు అవకాశం కల్పించడం వంటి అంశాలపై ప్రభుత్వ స్పందన ప్రశంసనీయమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రిమండలికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగులే సభ్యులుగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. దీని ద్వారా ఉద్యోగులకు మరింత నాణ్యమైన క్యాష్‌లెస్ వైద్య సౌకర్యం అందుబాటులోకి రానుందని చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుండటంతో, త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి అన్ని ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి వాటి నుంచి వచ్చిన ప్రతిపాదనల్ని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కమిటీకి ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, ఉద్యోగుల సమస్యలు తక్షణ పరిష్కారానికి అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు, కాంటిజెంట్ సిబ్బంది, పెన్షనర్లు తదితర వర్గాల సమస్యలను మూడు విభాగాలుగా విభజించి అత్యవసర, ఆర్థికేతర, ఆర్థిక సమస్యలుగా అధికారులకు వివరించామని చెప్పారు. ముఖ్యంగా రూ.10 లక్షల లోపు బిల్లులను ఈ-కుబేర్ ద్వారా క్లియర్ చేయాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో, ప్రభుత్వం నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తామని అంగీకరించడం ఉద్యోగులకు ఊరట కలిగించే అంశమన్నారు. జేఏసీ నేతలు తమ ప్రతిపాదనల భాగంగా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటును కోరినట్లు తెలిపారు. అలాగే సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్) పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జీఓ 317 ప్రకారం అంతరజిల్లా దంపతుల బదిలీల సమస్యను భవిష్యత్తులో ఖాళీల్లో పరిగణనలోకి తీసుకోవాలని, సీనియారిటీ ఆధారంగా ఇతర జోన్లు లేదా జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి వారి స్థానిక ప్రాంతాల్లో నియమించాలనే డిమాండ్లు కూడా తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి, కాబినెట్ తీసుకున్న నిర్ణయాల పట్ల ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని మిగిలిన రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ కో-ఛైర్మన్లు కె. రామకృష్ణ (తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం), ఎస్. రాములు (తహసీల్దార్ల సంఘం), కె. హన్మంత్ రావు (ఉపాధ్యాయ సంఘం) తదితరులు పాల్గొన్నారు. అన్ని వర్గాల ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించేలా ప్రభుత్వం ముందుకు సాగుతుండటంపై జేఏసీ నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు.


## విక్రమ్ శిలా బుద్ధ విహార్‌కు యాంప్లిఫైయర్ అందజేత



**ముధోల్, జూన్ 6 (జనస్వరం) :** మండలంలోని రాంటేక్ గ్రామంలో ఉన్న విక్రమ్ శిలా బుద్ధ విహార్‌కు డీజే పవర్ సంస్థ అధినేత పురుషోత్తం డీజే రెండు బాక్స్‌లతో కూడిన 800 వాట్ల సామర్థ్యం గల యాంప్లిఫైయర్‌ను ఉచితంగా అందజేశారు. బుద్ధ వందన సమయంలో ప్రతి ఒక్కరికీ స్పష్టంగా ధ్వని వినిపించేలా చేయాలన్న సంకల్పంతో రాంటేక్ అంబేద్కర్ సంఘం సభ్యుల సూచన మేరకు ఈ యాంప్లిఫైయర్‌ను విహార్‌కు అందించినట్టు పురుషోత్తం తెలిపారు. ఈ యాంప్లిఫైయర్ మార్కెట్ విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని ఆయన తెలిపారు. బుద్ధవారసత్వం, విహార్ శ్రద్ధాభివృద్ధి కోసం చేయబడిన ఈ దానం పట్ల అంబేద్కర్ సంఘం సభ్యులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవ్కే బాబాసాహెబ్, దేవ్కే సంతోష్, దుమ్నే రమేష్, దేవ్కే శాంరూత్, దేవ్కే పీరాజీ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

### ఎమ్మెల్యే రామారావ్ పటేల్



**భైంసా, జూన్ 6 (జనస్వరం) :** తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన భైంసా ప్రాంతానికి చెందిన పేదలకూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ లబ్ధిదారులకు అందజేశారు. ముధోల్‌లోని ఎస్.ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో 102 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.48 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావ్ పటేల్ మాట్లాడుతూ, "సీఎం సహాయనిధి ద్వారా ఇప్పటికే మా నియోజకవర్గంలో 2700 మందికి ఆర్థిక సహాయం అందించాం. వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్య తరగతి ప్రజలకు ఇది ఒక వరంలాంటిదిగా మారిందని" పేర్కొన్నారు. ఈ సహాయ నిధిని మరింత విస్తృతంగా ఉపయోగపడేలా చేయడంలో తన కార్యాలయం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సోలంకి భీం రావ్, భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సిరం సుష్మా రెడ్డి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, "ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ప్రజల కోసం ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేయడం, అందులో ఆరుగురు సలహాదారులను నియమించి నిరంతరం ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించడమన్నది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ వైస్ ఎంపీపీ నర్సారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రావుల రాము, మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీసీఓబీ చైర్మన్‌గా గన్నీ వీరాంజనేయులు ప్రమాణ స్వీకారం

**శుభాకాంక్షలు తెలిపిన ఆర్టీసీ జోనల్ చైర్మన్ అప్పలనాయుడు**



**గన్నవరం, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ గన్నీ వీరాంజనేయులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ (ఏపీసీఓబీ) చైర్మన్‌గా శుక్రవారం గన్నవరం విమానాశ్రయం సమీపంలోని ఏబీ కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీఎస్‌ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇంచార్జ్ రెడ్డి అప్పలనాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏపీసీఓబీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వీరాంజనేయులు మరింత ప్రజల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, జనసేన మీడియా ఇంచార్జ్ రవి, నాయకులు ఇద్దుం చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# పంట కాల్వల నిర్మాణాలను పూర్తి చేయండి



**పులివెందుల, జూన్ 6 (జనస్వరం) :** నియోజకవర్గంలో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసుకోవడానికి ఉపయోగపడే పంట కాలువల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల అసెంబ్లీ కోఆర్డినేటర్ ధ్రువ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతుల పట్ల ప్రత్యేక చొరవ చూపారన్నారు. జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా గండికోట ప్రాజె క్టును 80 నుంచి 90శాతం వరకు పనులు పూర్తి చేయించారని తెలిపారు. ఈ క్రమంలో పులివెం దుల ప్రాంత రైతాంగానికి నీరందించేందుకు పైడిపాలెం ప్రాజెక్టును కూడా పూర్తి చేయించి చిత్రా వతి గేట్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేయించారన్నారు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి చూపిన చొరవ వల్ల ప్రస్తుతం పైడిపాలెం ప్రాజెక్టులో 5 టీఎంసీలు అలాగే చిత్రావతి ప్రాజెక్టులో 7 టీఎంసీలు చొప్పున నీరు ఉందన్నారు. పంట కాలువలు లేనందున రైతులు కూడా నిరుత్సా హానికి గురవుతున్నారన్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదన్నారు. ప్రస్తుతం ప్రధాన కాలువలు వాగులు, వంకలు చెరువులకు మాత్రమే నీటిని వదులుతున్నారన్నారు. కృష్ణా జలాలతో పులివెందుల ప్రాంతం పునీతం కావాలంటే పంట కాలువల నిర్మాణాలను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ధ్రువ కుమార్ రెడ్డి కోరారు.

# బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా చేరండి



**పులివెందుల, జూన్ 6 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలో బ్రాహ్మణులు అందరు సభ్యులుగా చేరాలని కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పీవీఎస్వీ ప్రసాదరావు కోరారు. ఆయన మాట్లాడుతూ క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా చేరితే ఎన్నో లాభాలు ఉన్నాయని పేర్కొన్నారు. సభ్యులుగా చేరినవారు ముగ్గురుగా ఉంటే గ్రూప్ లో లోన్స్ మంజూరు చేస్తారని, బ్యాంకుల కంటే తక్కువ వడ్డీ అని తెలిపారు. అదేవిధంగా వ్యక్తిగత రుణాలు తీసుకొనే అవకాశం ఉందని అంటూ వ్యాపారం కోసం మొదట్లో రెండు లక్షల రూపాయలు రుణంగా పొందవచ్చున్నారు. బ్యాంకుల్లో తీసుకొనే వడ్డీ కంటే తక్కువ కాబట్టి అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యత్వం ఉంటేనే అవకాశమని 18 నుండి 60 సంవత్సరాల వరకు సభ్యత్వం పొందవచ్చున్నారు. అంతేగాక సభ్యత్వం ఉన్నవ్యక్తులు ఆకస్మికంగా మరణిస్తే సొసైటీ రూ.50000లు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. రూ.600లు చెల్లించి సభ్యత్వం తీసుకొంటే రూ.100లు మెంబర్షిప్ కోసం తీసుకోని రూ.500లు డిపాజిట్ గా పెట్టుకుంటారని, సభ్యత్వం వద్దని అనుకొన్నప్పుడు రూ.500లు తిరిగి ఇస్తారని తెలిపారు. ఇప్పటికి సభ్యత్వం తీసుకోని వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బెంగళూరు తొక్కిసలాటలో అన్నమయ్య జిల్లా యువతి మృతి



**పులివెందుల, జూన్ 6 (జనస్వరం) :** బెంగుళూరు తొక్కిసలాటలో చిన్నమండెం మండలం యర్ర గుట్టవాండ్లపల్లెకు చెందిన శివ కుమార్తె దివ్యాంశి (14) యువతి మృతి చెందింది. ఐపీఎల్ -2025 విజేతగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలవడంతో బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో క్రీడాకారులకు సన్మాన సభ నిర్వహించిన విషయం తెలిసింది. ఈ వేడుకలను చూడటానికి శివ తన భార్య, కుమార్తెతో వెళ్లాడు. తొక్కిసలాటలో బాలికపై గేట్ పడడంతో తలకు బలమైన గాయమై మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

# 9న ఏలూరు కలెక్టరేట్ ముందు ఆయిల్ పామ్ రైతుల ధర్నా

- **50 శాతం పామాయిల్ పై దిగుమతి సుంకం పెంచి ?**
  **ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి**



**పెదవేగి (విజయరాయి) జూన్ 6 (జనస్వరం) :** కేంద్ర ప్రభుత్వం పామాయిల్ పై 10 శాతం దిగుమతి సుంకం తగ్గించడంపై ఈనెల 9న ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ ముందు ఆయిల్ పామ్ రైతుల ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు ఆయిల్ పామ్ రైతుల సామూహిక రాయబార కార్యక్రమం చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం విజయరాయిలోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో ఆయిల్ పామ్ రైతుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మున్నంగి సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఆయిల్ పామ్ రైతుల జిల్లా కలెక్టర్ ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ముడి పామాయిల్ దిగుమతి సుంకం 10 శాతం తగ్గించి వేయడంతో ఆయిల్ పామ్ గెలల ధర తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల రీత్యా టన్ను ఆయిల్ పామ్ గెలలకు రూ.22 వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ముడి పామాయిల్ పై దిగుమతి సుంకం 50 శాతం పెంచాలని కోరారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రైవేటు పనులు చేయాలని ఆలోచన విరమించుకోవాలన్నారు. పెదవేగిలో కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న ఏలూరు కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పూసం రామరెడ్డి, రాపర్ల తేజ కృష్ణ, నీలం శ్రీనివాసరావు, భీమవరపు సాంబిరెడ్డి, ఆళ్ల చంద్రశేఖర్ రెడ్డి, దారి బోయిన రమేష్,ఎం. జగన్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ కొస్తా రైల్వే జోన్ జీఎం నియామకం హర్షణీయం

- **త్వరలో గెజిట్ నోటిఫికేషన్ కు కసరత్తు**
- **ప్రధాని మోదీకి, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కి సీఎం చంద్రబాబుకి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి కృతజ్ఞతలు**
- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**విజయవాడ, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం దక్షిణ కొస్తా రైల్వే జోన్‌కు మరో ముందడుగు పడిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు శర వేగంగా సాగుతుంది. అందులో భాగంగా రైల్వే జోన్ కు తొలి జీఎంగా సందీప్ మాథుర్ ను కేంద్ర ప్రభుత్వం నియమించడం హర్షణీయమన్నారు. జోన్ ఏర్పాట్లులో అత్యంత కీలకమైన చర్యగా భావిస్తున్నట్లు తెలిపారు. పరిపాల అనుమతులు పనులు వేగవంతం అయ్యేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు. రైల్వే జోన్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గత ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైల్వే జోన్ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. జోన్‌కు అవసరమైన 54 ఎకరాల భూమి కేటాయించకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. దీనివలన ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందని. ప్రస్తుతం రైల్వే జోన్ పనులు తిరిగి ప్రారంభమై వేగవంతంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇప్పటికే 54 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అప్పగించడం జరిగిందని, జోన్ ఏర్పాటుతో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడంతో పాటు రైల్వే ఆపరేషన్స్ సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. విశాఖలోని ముడసర్ లోవలో ఇప్పటికే స్థలాన్ని కేటాయించడం జరిగిందని తెలిపారు. రూ.149 కోట్ల వ్యయంతో 9 అంతస్తుల రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. సీఎం ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ప్రధానమంత్రి, రైల్వే శాఖ మంత్రితో దప దపాలుగా చర్చలు జరిపి రైల్వే జోన్ ఏర్పాటుకు వేగం పెంచారు. గత 12 నెలల కాలంలో రూ.75 వేల కోట్ల జాతీయ రహదారి ప్రాజెక్టులు రూ.72 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి తీసుకు వచ్చారని తెలిపారు. తద్వారా రాష్ట్ర అభివృద్ధి చురుగ్గా సాగుతోందని, విశాఖ రైల్వే జోన్‌పై గజిట్ నోటిఫికేషన్ త్వరలో ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. దీనివలన ఉత్తరాంధ్ర జిల్లాలకు మరింత అభివృద్ధి సూచికలు రానున్నాయని పేర్కొన్నారు.

# జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 50 శాతం రాయితీ

**ఏపీయూడబ్ల్యూజే నేతలకు తిరుపతి కలెక్టర్ హామీ**



**తిరుపతి, జూన్ 6 (జనస్వరం) :** తిరుపతి జిల్లాలోని అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ కల్పిస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరేంద్ర రాయల్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేయాలని డీఈఓ, ఆర్ఐఓ లకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ కు ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మెంబర్ వై.కోటేశ్వరబాబు, జిల్లా సహాయ కార్యదర్శి తారక, జర్నలిస్టులు సురేష్, పురుషోత్తం, విసి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులపై అధికార యంత్రాంగం గుణపం పోటు

- **దుకాణాల తొలగింపుతో దెబ్బతిన్న జీవనోపాధి**
- **దుకాణ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి**
- **చింతపల్లి జడ్పిటీసీ బాలయ్య**






**చింతపల్లి, జూన్ 6 (జనస్వరం) :** బ్రిటిష్ పాలన నాటి నుంచి చింతపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులపై అల్లూరి జిల్లా అధికార యంత్రాంగం గుణపం పోటు పెట్టిందని స్థానిక జడ్పిటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మండిపడ్డారు. రోడ్డు విస్తరణ పనుల పేరిట నిర్దాక్షిణ్యంగా వారి దుకాణాలు తొలగించడం వల్ల అనేక కుటుంబాలు తమ జీవనోపాధిని కోల్పోయాయని ఆయన ఆవేదన వ్యక్తమైంది. ఈ మేరకు జడ్పిటిసి బాలయ్య ఆధ్వర్యంలో దుకాణదారులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో సుమారు 250 కుటుంబాలు ఈ చిరు షాపులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, విస్తరణ పనుల్లో రెవెన్యూ శాఖ అధికారులు కొలతల విషయంలో అసమానతలు ప్రదర్శిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారిని ప్రయోజనపరిచేలా కొలతలు తగ్గించి, సామాన్యుల వద్ద మాత్రం పెంచడం తీవ్ర అన్యాయం అన్నారు. చింతపల్లి పోలీస్ స్టేషన్ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు 120 అడుగులు, పోలీస్ స్టేషన్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు 100 అడుగుల మేర విస్తరణ చేపడుతున్న సందర్భంగా కొలతల విషయంలో గిరాకీ మేరకు మార్పులు చేయడం సరికాదని ఆయన విమర్శించారు. బాధితులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని, అందరికీ సమానంగా కొలతలు జరగాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దురియ హేమంత్ కుమార్, పసుపులేటి వినాయకరావు, నూరు సాహెబ్ తో పాటు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో దుకాణదారులు, మహిళలు పాల్గొన్నారు.

# పోతునూరులో ఘనంగా కోదండ రామాలయం వార్షికోత్సవ వేడుకలు



**దెందులూరు, జూన్ 6 (జనస్వరం) :** మండలంలోని పోతునూరు గ్రామంలోని శ్రీ కోదండ రామాలయ రెండవ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పోతునూరు గ్రామస్తులు ఆధ్వర్యంలో కోదండ రామాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం, కోలాటం భజనలను నిర్వహించారు .గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోతునూరు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వింత ఆకారంలో మిరపకాయ కలకలం



**చింతపల్లి/జీకే వీధి జూన్ 6 (జనస్వరం) :** సాధారణంగా మనకు కనిపించే మిరపకాయల కన్నా భిన్నంగా, మనిషి శరీరాకృతిని తలపించే విధంగా పెరిగిన ఒక మిరపకాయ అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలో కలకలం రేపుతోంది. గూడెం కొత్త వీధి మండలం సంకాడ పంచాయతీ పరిధిలోని గోవాడ గ్రామానికి చెందిన గిరిజన రైతు జర్త జీవన్ కుమార్ తన తోటలో ఈ అరుదైన ఆకృతిలో ఉన్న మిరపకాయను గమనించి ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, మామూలుగా కనిపించే మిరపకాయల కంటే ఇది పూర్తిగా భిన్నంగా ఉండటమే కాకుండా, పై భాగంలో తల ఆకృతి, క్రింది భాగంలో శరీరాకృతి స్పష్టంగా కనిపించడంతో, ఇది ఒక విభిన్నమైన ప్రకృతి విశేషమైందిగా భావిస్తున్నారు. ఈ మిరపకాయను చూసిన గ్రామస్థులు, ఇది ఏదో దివ్యశక్తి సంకేతమని భావిస్తూ కొందరు పూజలు కూడా ప్రారంభించారు. మరోవైపు, ఇది విత్తనాల, వాతావరణ పరిస్థితుల కలయికలో ఏర్పడే సహజ రకాల వైవిధ్యం మాత్రమేనని కొందరు వాస్తవవాదులు అభిప్రాయపడుతున్నారు. ఈ వింత ఆకృతి మిరపకాయను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలన చేసి దీనిపై శాస్త్రీయ విశ్లేషణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నష్టపోయిన చిరు వ్యాపారులను ఆదుకోండి

**చింతపల్లి సర్పంచ్ పుష్పలత**



**చింతపల్లి, జూన్ 6 (జనస్వరం) :** రహదారి విస్తరణ చర్యల దెబ్బకు జీవనాధారాన్ని కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలంటూ చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత డిమాండ్ చేశారు. దుకాణాల తొలగింపుతో కుటుంబాలతో సహా చిరు వ్యాపారులు రోడ్డున పడిన పరిస్థితిని ఆమె తీవ్రంగా అభివర్ణించారు. ఉన్నదైన అనుమతులతో వాణిజ్యం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం అన్యాయమని అభిప్రాయపడిన ఆమె ఇది వారి పొట్ట మీద పడి చేసిన అన్యాయమన్నారు. చిన్న వ్యాపారులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వం మీదే ఉందని స్పష్టం చేశారు. దుకాణాలపై చేసిన పెట్టుబడుల ద్వారా ఏర్పడిన అప్పులు ఇప్పుడా కుటుంబాలను మానసికంగా కుంగదీస్తున్నాయని, పలువురు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం తక్షణం స్పందించి పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# చిత్రాడలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ



**చిత్రాడ, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం వెనకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ప్రోత్సాహంతో మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చే లక్ష్యంతో ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం అంతర్గతంగా పిఠాపురం మండలంలోని చిత్రాడ గ్రామ సచివాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో కొనసాగుతోంది. చిత్రాడ, కందరాడ, కుమారపురం, జమునపల్లి, నరసింగపురం గ్రామాలకు చెందిన 143 మంది మహిళలు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. శిక్షకురాలు యాగ శ్రావణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ పెంకే రమణమ్మల నేతృత్వంలో ఈ శిక్షణ కొనసాగుతోంది. మహిళలు టైలరింగ్ రంగంలో నైపుణ్యం కలిగి స్వయం ఉపాధి సాధించేందుకు 90 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో ప్రామాణిక మౌలిక విద్యతోపాటు శాస్త్రీయమైన దుస్తుల మోడలింగ్, డిజైనింగ్ పై కూడా అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణ ముగిసిన అనంతరం మహిళలకు ధృవీకరణ పత్రాలుతో పాటు ఉచితంగా కుట్టు మిషన్‌లను కూడా ప్రభుత్వం అందించనుందని నిర్వాహకులు వెల్లడించారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వయం ఆధారంగా ఎదగడాన్ని లక్ష్యంగా పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మరింత మంది లబ్ధిదారులకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

# కలెక్టర్ ఫిర్యాదు వల్ల కదిలిన పోలీసు యంత్రాంగం

**గాజువాకలో దాడిపై స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు**



**గాజువాక, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్‌పై జరిగిన దాడి ఘటనలో పోలీసులు ముందుగా చర్యలు తీసుకోకపోయినా, జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు తర్వాత పోలీసు వ్యవస్థ కదిలింది. గాజువాకలో జరిగిన ఈ ఘటనపై రామ్ ఇచ్చిన పిర్యాదును అనుసరించి శుక్రవారం పోలీసులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ మేరకు బి.వి.రామ్ మాట్లాడుతూ మే 12న మధ్యాహ్నం 2:50 గంటల సమయంలో గాజువాక బెస్ట్ వెస్టర్న్ హోటల్ వద్ద భోజనం చేసిన అనంతరం బయటకు వస్తుండగా, పల్లా శ్రీనివాస్ అనుచరులు తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. అందులో ప్రసాదుల శ్రీనివాస్ అనే వ్యక్తి ముఖ్యపాత్ర పోషించాడని తెలిపారు. ఈ దాడిలో తన మెడలోని రెండు తులాల బంగారు చైన్, చేతికి ఉన్న ఉంగరం, అలాగే జేబులో ఉన్న రూ.37,000 నగదు లాక్కొన్నారని పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే అదే రోజున సాయంత్రం 4 గంటలకు గాజువాక ఏసీపీకి ఫిర్యాదు చేశానని, స్టేట్‌మెంట్ తీసుకున్నా కానీ కేసు నమోదు చేయలేదని తెలిపారు. అనంతరం మే 13న విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌కు వ్రాతపూర్వకంగా నివేదిక ఇచ్చినా స్పందన లేకపోయిందని, దాంతో జూన్ 2న ప్రజా ఫిర్యాదు గలిక్షణ ప్లాట్‌ఫామ్ ద్వారా కేసు నమోదుకు ప్రయత్నించానన్నారు. రిపోర్టు నంబర్ VSP20256021861 ఆధారంగా గాజువాక పోలీసులు స్టేట్‌మెంట్ నమోదు చేశారని వెల్లడించారు. రామ్ గతంలో పల్లా శ్రీనివాస్ రావుపై ఢిల్లీలోని కేంద్ర హోంశాఖకు, సీబీఐకి నివేదికలు పంపిన నేపథ్యంలో తనపై కక్షతీర్చుకునేలా దాడి జరిగినదిగా అనుమానం వ్యక్తం చేశారు. దాడిలో పి.మురళీ కృష్ణ, ప్రసాదుల శ్రీనివాస్, ఇతరులు పాల్గొన్నారని ఆరోపించారు. ఈ మేరకు జూన్ 6న గాజువాక సీఐ ఏ. పార్థసారధి విచారణ చేపట్టి వివరాలు నమోదు చేశారని తెలిపారు. ఈ ఘటనపై సంబంధితులపై తగిన చర్యలు తీసుకుని తక్షణమే న్యాయం చేయాలని బి.వి. రామ్ ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను కోరారు.

# ఫోర్త్ ఎస్టేట్‌కు బాసటగా కూటమి సర్కార్



న్యాయ శాఖ మంత్రి ఫరూఖ్







**నంద్యాల, జూన్ 6 (జనస్వరం) :** పత్రికా రంగం అనేది ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రముఖ వేదిక అని పేర్కొంటూ, ఫోర్త్ ఎస్టేట్ అయిన జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డీ ఫరూఖ్ స్పష్టం చేశారు. నంద్యాలలో ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ (ఐరా) జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, “చంద్రబాబు నాయుడు హయాంలో వర్కింగ్ జర్నలిస్టులకు అనేక రకాల సౌకర్యాలు అందించాము. ఇప్పటికి కూడా జర్నలిస్టులకు న్యాయమైన హక్కులు కల్పించేందుకు కృషి చేస్తాం. జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రెస్ క్లబ్‌ను ఏర్పాటు చేస్తాం. అక్రెడిటేషన్‌ను అందరికీ జారీ చేయాలన్నదే మా లక్ష్యం. ఐరా ప్రతినిధులు కోరిన ఆరు హామీలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధించేందుకు కృషి చేస్తాను,” అని తెలిపారు. తెలుగు యువత నాయకుడు ఎన్ఎండి ఫయాజ్ భాషా మాట్లాడుతూ, జర్నలిస్టులు స్వేచ్ఛగా పనిచేయగల వాతావరణాన్ని కూటమి ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రజలకు చేరుస్తూ, ప్రభుత్వానికి ప్రజల సమస్యలను పరిచయం చేస్తూ జర్నలిస్టులు కీలక భూమిక పోషిస్తున్నారని ప్రశంసించారు. నేషనల్ విద్యా సంస్థల అధినేత ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, పాత్రికేయుల సంక్షేమంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, గతంలో ట్రిపుల్ బెడ్ రూం ఇల్లు, ఉచిత బీమా వంటి పథకాలను చంద్రబాబు అమలు చేశారని గుర్తుచేశారు. ఉర్దూ డిస్ట్రిక్ట్ ఇన్స్పెక్టర్ అస్మదుద్దీన్ మాట్లాడుతూ, పాత్రికేయులు ఎంతటి పరిస్థితులలోనైనా వార్తలను అందించడం అభినందనీయం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మిద్దె చిన్న హుస్సేని, గోస్పాడు మండల కన్వీనర్ కాటం రెడ్డి తులసీశ్వర రెడ్డి పాల్గొన్నారు. మంత్రి ఫరూఖ్ పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తారని, ఐరా సంస్థ పాత్రికేయుల హక్కుల కోసం ముందుండి పోరాడాలని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో మంత్రి ఫరూఖ్ చేతుల మీదుగా 25 మంది సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. వారి అనుభవాలను ఐరా సభ్యులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐరా జాతీయ కార్యదర్శి జాషువా, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మాఖం సుబ్బారాయుడు, సంటిగారి జయప్రకాశ్, సలహాదారులు దేవేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్ బాబు, ఉపాధ్యక్షుడు విజయ్ బాబు, జిల్లా అధ్యక్షుడు లెజెండ్ శీను, ప్రధాన కార్యదర్శి రంగారావు, ఇతర సీనియర్ జర్నలిస్టులు కంభం సతీశ్ కుమార్, కిషోర్, షరీఫ్, రమణ రెడ్డి, పసుపులేటి జనార్ధన్, జాకీర్ హుస్సేన్, నాగప్రసాద్, గంగాధర్ రెడ్డి, వెలుగొండారెడ్డి, నాగవర్ధన్ రెడ్డి, చల్లా మధు, ప్రదీప్, మహేష్ బాబు, రాజేష్, విజయానంద్, చింతలపల్లె వాసు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు మండ్ల గుర్రప్ప, న్యాయవాది బాలస్వామి, జనసేన నాయకులు పిడతల సుధాకర్, సందీప్ పాల్గొనడం విశేషం.

## చిలకలూరిపేట అభివృద్ధికి ప్రత్తిపాటి కృషి అభినందనీయం

**మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని**



**చిలకలూరిపేట, జూన్ 6 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తైన సందర్భంగా చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.

**శాశ్వత తాగునీటి సరఫరా.. రూ.116 కోట్ల పైప్‌లైన్ పథకం :**
సాగర్ నుంచి చెరువుకు నేరుగా పైప్‌లైన్ వేసే భారీ ప్రాజెక్టును తీసుకురావడంలో పుల్లారావు కీలకంగా వ్యవహరించారని చైర్మన్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా చిలకలూరిపేట ప్రజల తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. 22వ వార్డు కౌన్సిలర్ కునల ప్రమీల మాట్లాడుతూ, 116 కోట్లతో 38 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మించడంలో పుల్లారావుకే ఘనత దక్కుతుందని తెలిపారు.

**పారిశుద్ధ్య పర్యవేక్షణ.. నిర్లక్ష్యం వద్దంటూ కఠిన చర్యలు :**
పురపాలక సంఘంలో పారిశుద్ధ్య అంశాన్ని నిర్లక్ష్యం చేసిన వారిపై కఠినంగా వ్యవహరించామని, కమిషనర్‌కు తగిన ఆదేశాలు ఇచ్చినట్టు రఫాని తెలిపారు. నిన్నటితో చెరువు నిండిన సంగతి, ఈ రోజు మరో చెరువు నిండుతుండడం వల్ల రాబోయే నాలుగు నెలల పాటు తాగునీటి కొరత ఉండదని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు :**
నూతన రోడ్లు, మరమ్మత్తులు కోసం రూ.2 కోట్లు, బీపీఎల్ పథకాల కోసం రూ.4 కోట్లు మంజూరు చేయించినట్టు చైర్మన్ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, కౌన్సిల్ ద్వారా పనులు ప్రారంభించాలన్నదే లక్ష్యమని తెలిపారు.

**ఆరోగ్యశాఖ ద్వారా రూ.10 కోట్ల ఆసుపత్రి అభివృద్ధి :**
పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్షానికి గురైన ప్రభుత్వ ఆసుపత్రిని ప్రస్తుత ప్రభుత్వం తిరిగి అభివృద్ధిపథంలోకి తీసుకువచ్చిందన్నారు. పుల్లారావు పదిసార్లు ఆసుపత్రిని సందర్శించి, అవసరాలను గుర్తించి, ఆరోగ్యశాఖ ద్వారా రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు.


**ప్రజల దాహార్తిని తీర్చే నాయకత్వం అవసరం :**
ప్రత్తిపాటి పుల్లారావు నాయకత్వంలో అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజల అవసరాలను గుర్తించి కృషి చేస్తున్న ఆయన లాంటి నాయకులు ప్రజలకు వరమని కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. సమావేశంలో కౌన్సిలర్ లక్ష్మీ తిరుమల, జంగా సుజాత, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం




**పాయకరావుపేట, జూన్ 6 (జనస్వరం) :** పట్టణంలోని శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాయకరావుపేట బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భవాని విచ్చేసారు. ఈ సంధర్భంగా ప్రధానోపాధ్యారాలు భవానీ మాట్లాడుతూ.. గ్రంధాలయంలో 40 రోజులపాటు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ గ్రంధాలయానికి విచ్చేసి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎంతో వ్యయ, ప్రయాసలతో వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రంధాలయ అధికారి వామాల లక్ష్మణరావు (శ్రీను)ను అభినందించారు. వేసవి శిబిరంలో విద్యార్థులకు పాఠాలు చెప్పిన గురువులు అచ్యుతరావు, యోగా టీచర్ ఇ శ్రీనివాసరాజు, ఎస్ సీతారామమూర్తిలను ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు వరలక్ష్మీ, విశ్రాంతి ఉపాధ్యాయులు ఎస్ సీతారామూర్తి, దేవత పాపారావు, ముత్యాల సూర్యనారాయణ, ఎన్ టి సీతారామ మూర్తి, తాళ్ల రావు, తేజోమూర్తుల వెంకటేశ్వర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాలలో ఏసీఎం పిచికారి



**పులివెందుల, జూన్ 6 (జనస్వరం) :** మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు పులివెందుల సబ్ యూనిట్ పరిధిలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పులివెందుల ప్రభత్వ బాలికల కళాశాల వసతి గృహం, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలల్లో ఏసీఎం పిచికారి చేశారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ హాస్టల్ పరిసరాల్లో దోమలను అరికట్టడానికి, విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పిచికారి చేపట్టామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ప్రభుత్వ వసతి గృహంలో పిచికారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు ఇది ఒక ముఖ్యమైన చర్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సోమలింగారెడ్డి, వసతి గృహ సంక్షేమ అధికారి లక్ష్మి శైలజ పాల్గొన్నారు.

## పదవ తరగతి మూల్యాంకనంలో ఘోర తప్పిదాలు

**- 6.14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారం**

**- వైఎస్సార్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు వరప్రసాద్ ఆగ్రహం**



**చింతపల్లి, జూన్ 6 (జనస్వరం) :** పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో చోటుచేసుకున్న తీవ్రమైన తప్పిదాలు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వైఎస్సార్ విద్యార్థి విభాగం అల్లూరి జిల్లా అధ్యక్షుడు లోచలి వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6.14 లక్షల మంది విద్యార్థులు రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడి చదువుకున్నా, జవాబు పత్రాల మూల్యాంకనంలో పారదర్శకత లేకపోవడం, తప్పుల మూల్యాంకన విధానం వల్ల తప్పుడు ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఈ కారణంగా విద్యార్థులు ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, గురుకుల కళా శాలలు వంటి ప్రఖ్యాత విద్యా సంస్థల ప్రవేశాలకు అనర్హులవుతున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న పరిస్థితి నెలకొందని తీవ్రంగా విమర్శించారు. ఈ పరిస్థితులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల ప్రయోజనాన్ని కాపాడేందుకు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గ్రంథాలయ ‘వేసవి విజ్ఞాన శిబిరం’ ఘన ముగింపు





**పెదపాడు, జూన్ 6 (జనస్వరం) :** పెదపాడు శాఖా గ్రంథాలయం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. మే 28 నుండి జూన్ 6 వరకు 10 రోజుల పాటు సాగిన ఈ శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు జ్ఞాన కార్యక్రమాల్లో చురుకుగా నిమగ్నమయ్యారు. శుక్రవారం జరిగిన ముగింపు ఉత్సవానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఎంఈఓ లంకపల్లి మహాలక్ష్మయ్య, ఎంపీడీఓ కార్యాలయ ఏవో ఆర్.వి. రవి కుమార్, శ్రీకృష్ణ గురుకులం స్కూల్ మాస్టర్ శేటికం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమానికి వేల్పుల ప్రభాకర్ (ఎంపీపీ స్కూల్ హెచ్.ఎం) అధ్యక్షత వహించారు. ఈ క్యాంపులో వివిధ పాఠశాలల నుండి వచ్చిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శిబిరంలో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ వంటి పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, “విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాల్లో నిర్వహించే ఈ శిబిరాలు ఎంతో దోహదపడతాయి. సెల్‌ఫోన్ బానిసత్వం నుండి బయటపడేందుకు, చదువుపట్ల మక్కువ పెంచేందుకు విద్యార్థులు గ్రంథాలయాన్ని నిత్యం సందర్శించాలని” సూచించారు. గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు వందనసమర్పణ చేస్తూ, కార్యక్రమానికి హాజరైన అతిథులకు, విద్యార్థులకు, శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన రిసోర్స్ పర్సన్‌లకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహించే “చదవడం మాకిష్టం” కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై తమ విజ్ఞానాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అన్ని విద్యార్థులకు అల్పాహారం (స్నాక్స్) పంపిణీ చేశారు. శిబిరం చివరికి సంతృప్తికరంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

## గరుడ వాహనంపై గోవిందరాజు కటాక్షం

**సేవకోసం శ్రీవారి నగలు అలంకరణ**



**తిరుపతి, జూన్ 6 (జనస్వరం) :** తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం గరుడసేవ సందర్భంగా తిరుమల శ్రీవారి కానుకగా సుమారు రూ.34.46 లక్షల విలువైన మూడు ఆభరణాలను టీటీడీ సమర్పించింది. తన అన్నగారైన శ్రీ గోవింద రాజునికి తిరుమల శ్రీవారు దాదాపు రూ. 34.46 లక్షలు విలువ చేసే 03 ఆభరణాలు వాటిలో స్వామివార్ల దీర్ఘ చతురస్రాకార పతకం ఒకటి, అమ్మవార్ల దీర్ఘచతురస్రాకార రెండు పతకములను శాశ్వత ప్రాతిపదికన టీటీడీ బహుకరించింది. తిరుమల నుంచి ఈ ఆభరణాలను తీసుకొచ్చి గోవిందరాజ స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నుండి శ్రీవారి ఆభరణాలను ఊరేగింపుగా తిరుమల ఆలయ డిప్యూటీ ఈఓ ఎం.లోకనాథం శ్రీగోవిందరాజ స్వామి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరింపబడ్డ శ్రీ గోవిందరాజ స్వామి సకల వైభవంతో శక్తివంతమైన గరుడవాహనంపై, నాలుగు మాడ వీధుల వెంట విహారిస్తూ, ఆనందోత్సాహాల మధ్య తన భక్తులను ఆశీర్వదించారు. అంతకు ముందు గరుడ సేవ సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4 – 5 గం.ల మధ్య స్వామి వారికి నూతన వస్త్రాలు, తిరువడి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ ఊరేగింపు తిరుపతిలోని కోమలమ్మ సత్రం నుండి బజార్ వీధి, సన్నిధి వీధి నుండి శ్రీ గోవిందరాజ స్వామి ఆలయానికి చేరుకున్నాయి. ఏనుగులు, గుర్రాలు, రంగురంగుల నృత్య బృందాలు, కోలాటం కళాకారుల ప్రదర్శనలు వాహన ఊరేగింపు శోభను మరింత ఇనుమడింప చేసాయి. ఈ కార్యక్రమంలో టిటిడి ఎఫ్ ఏ అండ్ సిఏవో బాలాజీ, డిప్యూటీ ఈవో వి.ఆర్.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, తిరుమల ఆలయ బొక్కసం సూపరింటెండెంట్ వి.ఆర్.గురురాజ స్వామి, ఏవీఎస్వోలు రాజశేఖర్, మోహన్ రెడ్డి, పలువురు అర్చకులు, అధికారులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమీటిల నిర్మాణం వేగవంతం చేయండి

**జిల్లా ఇన్చార్జీ మంద వెంకటేశ్వరరావు మాదిగ**



**నెల్లూరు, జూన్ 6 (జనస్వరం) :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నేడు నెల్లూరు టౌన్‌లోని డా బీఆర్ అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయ్ కృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు జిల్లా ఇన్చార్జీ మంద వెంకటేశ్వరరావు మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్బంగా మంద వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకర సాధనకై ముప్పై సంవత్సరాల పాటు అలుపెరుగని పోరాటం చేసి నేడు ఎస్సీ వర్గీకరణ సాధించి నేడు ఫలాలు రేపో మాపో మన మాదిగ, మాదిగ ఉపకులాలకు అంద బోతున్నాయని భవిష్యత్‌లో మాదిగలు మరింత ముందుకు వెళ్ళేందకు.. ఎమ్మార్పీఎస్ ఉధ్యమాన్ని గ్రామ స్థాయిలో బలమైన శక్తిగా నిర్మాణం చేపట్టాలని అందుకు ప్రతీ నాయకుడు కష్టపడి పని చేయాలని సూచించారు. అదేవిదంగా ప్రతీ మాదిగ విధ్యార్థులు యువకులు ఉధ్యమంలో భాగస్వామ్యం కావాలని అందుకు నూతన ఇన్చార్జీలను ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగ,ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు కొప్పర్తి కొండయ్య మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు బెజవాడ పాపయ్య మాదిగ, ఎంఎస్పీ మహిళా ఇన్చార్జ్ గేరా జానకి మాల, ఎంఎఈఎఫ్ రాష్ట్ర నాయకులు వేగూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు తాళ్లూరు శేషయ్య మాదిగ, నియోజకవర్గాల ఇన్చార్జీలు సిద్ధవరపు పెంచలయ్య మాదిగ, కొమరిక రమణయ్య మాదిగ, చింతగుంట అంకయ్య మాదిగ, అక్కిలగుంట ఏసు మాదిగ, గొల్లపల్లి మోహన్ రావు మాదిగ, గంగపట్ల సింహాద్రీ మాదిగ, కొత్తపల్లి మాతయ్య మాదిగ, గోసాల సుధాకర్ మాదిగ, వడ్లపల్లి రమణమ్మ మాదిగ, ఎస్ స్వర్ణ లత మాదిగ, ఎం, మాచారం విజయ లక్ష్మీ మాదిగ, గోచిపాతల ఆనంద్ రావు మాదిగ, కావలి శ్రీనివాస్ మాదిగ, దండు భార్గవ్ మాదిగ, కర్రా మల్ళిఖార్జున మాదిగ, దర్శిగుంట వాసు మాదిగ, నాగరాజు మాదిగ, గంగపట్ల నాగరాజు మాదిగ, పల్లాల కుమారి మాదిగ, ఇండ్ల మురళి మాదిగ, ఎస్ హరి బాబు మాదిగ, గంగపట్ల ప్రకాష్ మాదిగ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఎంఈఎఫ్ ఎంఎంఎస్ నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో పోల్గొన్నారు.


## ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలంతా విజేతలే

**- ఎమ్మెల్యే చింతమనేని ఆధ్వర్యంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఒక్కొక్క మహిళకు 3000 రూపాయల నగదు అందజేసిన జనసేన, టీడీపీ నాయకులు**



**దెందులూరు, జూన్ 6 (జనస్వరం) :** వైసీపీ ప్రభుత్వం పోయి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మండలంలోని గాలాయగూడెంలోని శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో పూర్తయిన ఏడాది అనే కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో నగదు బహుమతులను గాలాయగూడెం పంచాయతీ జనసేన పార్టీ తరఫున గెలిచిన వార్డ్ మెంబర్, పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం దెందులూరు నియోజకవర్గ అధ్యక్షులు పూజారి వెంకటరత్నం నాయుడు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూజారి శ్రీనివాసరావు, తెలుగు యువత నాయకుడు దోరేపల్లి రమేష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత వెన్నమనేని రాజా నాయకులతో కలిసి దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ఆదేశాలతో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మొత్తం మహిళలందరికీ ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు చొప్పున రూ. లక్ష12 వేలను మహిళలకు స్థానిక జనసేన టిడిపి నాయకులు కలిసి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ ఏనుగు రామకృష్ణ, పూజారి రాజశేఖర్, పూజారి రామచంద్రరావు ఠాగూర్, పూజారి సీతారాం, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మద్దా దయానంద రాజు, నాయి బ్రాహ్మణ సేవాధికార సంస్థ దెందులూరు నియోజకవర్గం అధ్యక్షులు కొప్పాక వెంకటేశ్వరరావు (కొండ), పూజారి దుర్గారావు, దొరేపల్లి శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్ రావు,జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసేన వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన



**యలమంచిలి, జూన్ 6 (జనస్వరం) :** పట్టణంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో శుక్రవారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ట్రైనీ డీఎస్పీ శ్రీ చైతన్య ఆధ్వర్యం వహించారు. అన్ని ఆటో స్టాండ్‌లకు చెందిన డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ, “ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదు. ఇది ప్రమాదానికి దారితీయవచ్చు. అలాగే రోడ్ సైడ్ పార్కింగ్ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇటువంటి సందర్భాలలో నిబంధనలు అతిక్రమించిన వారికి కొత్త మోటారు వాహన చట్టం (ఎం.వి.యాక్ట్) ప్రకారం భారీ జరిమానాలు విధించబడతాయి” అని స్పష్టంగా తెలిపారు. ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని, ప్రజల భద్రతే తమక్కెలక్ష్యంగా ఉండాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**- భాగ్యంగా భావిస్తున్నాను : ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



**బుక్కపట్నం, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం లోని బుక్కపట్నం మండల కేంద్రంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "కాలజ్ఞానంతో మానవాళికి గొప్ప సందేశాలను అందించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయడం నాకు అదృష్టంగా భావిస్తున్నాను. స్వామివారి కాలజ్ఞానంలో చెప్పిన వాక్యాలు ఇప్పుడు ఒకొక్కటిగా నిజమవుతున్నాయి. ప్రపంచంలో ఏ వింత జరిగినా, అది బ్రహ్మం గారు ముందే చెప్పారు అనే విశ్వాసం ప్రతి ఒక్కరిలో ఉంది," అని అన్నారు. బుక్కపట్నం చెరువు పక్కన ఏర్పాటు చేస్తున్న ఈ ఆలయ నిర్మాణానికి వీరబ్రహ్మణ సంఘం ప్రతినిధులు ముఖ్యపాత్ర పోషించారు. భవన నిర్మాణానికి ప్రభుత్వంతోపాటు తనవంతు సహకారం పూర్తిగా అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే, ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత బుక్కపట్నం మండలంలోని విశ్వబ్రాహ్మణులకు, భక్తులకు ఇది ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని, ప్రశాంత వాతావరణంలో ఆలయం రూపొందించబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మల్లు రెడ్డి, మాజీ ఎంపీపీ బాలు, మాజీ సర్పంచ్ యశోద, వీరబ్రహ్మణ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అనుసరించి ఆలయ అభివృద్ధిపై భవిష్యత్తు కార్యచరణపై కూడా చర్చ జరిగింది.

## కైకలూరు పంచాయతీలో 4 ఏళ్లలో 8 కోట్లు అవినీతి

**- రికవరీ చేయాలంటూ కైకలూరు పాలకవర్గ సభ్యులు డిమాండ్**



**కైకలూరు, జూన్ 6 (జనస్వరం) :** నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన కైకలూరు గ్రామ పంచాయతీలో గత నాలుగేళ్లలో రూ 8 కోట్లు అవినీతి జరిగిందని జిల్లా అధికారులు గుర్తించినట్లు పాలకవర్గ సభ్యులు మేడూరి నాంచారయ్య, కె.వి.ఎన్.ఎం నాయుడులు తెలిపారు. శుక్రవారం కైకలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పాలకవర్గ సభ్యులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి పంచాయతీలో జరిగిన అవినీతి గురించి వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీల అభివృద్ధికి నిదులు స్తుంటే నిధులు లేవని చెప్పడమే కాకుండా గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిధులు డైవర్ట్ చేశారని చెప్పడం హాస్యస్పదంగా మారింది. తాము పాలకవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండి ఈరోజు వరకు తాము ఒక రోడ్డు కూడా వేసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పంచాయతీలో సాధారణంగా ఒక లక్ష లేదా రెండు లక్షల అవినీతి జరుగుతుందని ఇలా కోట్లలో అవినీతి జరిగిన సంఘటన కైకలూరులోనే ఉందని,రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ జరగలేదన్నారు. కైకలూరు గ్రామ పంచాయతీలో అవినీతి నేటికీ ఆగలేదన్నారు. అక్రమ కట్టడాల నిర్మాణంలో భారీ స్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, పంచాయతీ కార్మికుల జీతాలు చెల్లింపు సత్వరమే చేయాలని లేని యెడల పాలకవర్గ సభ్యులు అందరూ పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లింపు కోసం ఆమరణ నిరాహారదీక్ష కూడా చేస్తామన్నారు. పౌర పత్రం ఏర్పాటు చేయాలని కార్యదర్శి అడిగినట్లు తెలిపారు. మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఈ అవినీతిపై స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా కైకలూరు గ్రామపంచాయతీలో జరిగిన ఎనిమిది కోట్ల రూపాయలు రికవరీ చేసి పంచాయతీకి జమ చేసేలాగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీలకతీతంగా ఈ అవినీతిపై అందరూ మద్దతు తెలపాలన్నారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు మంచి కంటి శ్రీనివాసరావు, బిరుదు గద్ద రాజమణిలు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## ఏడేళ్ల తర్వాత విజయవంతంగా మెగా డిఎస్సీ చేపట్టాం

ఆంధ్రప్రదేశ్ ఉండాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. సప్లయ్ – డిమాండ్ కు అనుగుణంగా స్కిల్లింగ్ ఎకోసిస్టమ్ ను ఏర్పాటు చేయాలని, నైపుణ్యం యాప్ ను అప్ గ్రేడ్ చేయాలని స్కిల్ డెవలప్ మెంట్ అధికారులకు మంత్రి లోకేష్ సూచించారు. నైపుణ్యం పోర్టల్ లో అభ్యర్థుల నమోదు, శిక్షణ, సామర్థ్య పరీక్ష, సర్టిఫికేషన్, ఉద్యోగ కల్పన, పరిశ్రమల అనుసంధానం, పరిశ్రమల్లో ఖాళీల వివరాలు మొదలైన వాటిని పొందుపర్చాలన్నారు. సెక్టార్ వైజ్ ప్లేస్ మెంట్స్, జాబ్ మేళాల వివరాలను కూడా ఇందులో పొందుపర్చాలన్నారు. నైపుణ్యం యాప్ ద్వారా ఈ ఏడాది 6,83,052మంది దరఖాస్తు చేసుకోగా, 6,45,163మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చామని, వారిలో 77,703 మందికి ఉద్యోగాలు లభించాయని ఎపిఎస్ఎస్డిసి సిఇఓ గణేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రానికి మంజూరైన 125 ఆటిజం సెంటర్లను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆటిజంతో బాధపడుతున్న వారి తల్లిదండ్రులకు ఊరట కలిగించేలా ఈ సెంటర్లలో నిపుణులను ఎంపిక చెయ్యాలని ఆదేశించారు. ఆటిజంపై ఏర్పాటు చేసిన ప్రజా ప్రతినిధుల కమిటీ సలహాలు తీసుకోవాలని సూచించారు. స్కూల్ కిట్స్ అన్ని త్వరితగతిన విద్యార్థులకు అందేలా చూడాలని సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాస్ ను ఆదేశించారు. ఉన్నత విద్యపై మంత్రి నారా లోకేష్ సమీక్షిస్తూ.. యూనివర్సిటీల నుంచి విద్యార్థులు బయటకు వచ్చేటప్పటికే సరైన నైపుణ్య శిక్షణ పొంది ఉద్యోగం సాధించే దశకు చేరుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నైపుణ్యశిక్షణ కార్యక్రమాలను కాలేజ్ స్థాయిలోనే పెద్దఎత్తున చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ యూనివర్సిటీల విసి పదవులకు సెర్చి కమిటీల ద్వారా సాధ్యమైనంత త్వరగా పేర్లు సూచించాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తిని కోరారు. ఛైర్మన్ స్పందిస్తూ.. ఈనెలాఖరులోగా ఆయా వర్సిటీలకు సెర్చికమిటీ సిఫారసులను పంపిస్తామని తెలియజేసారు. వివిధ యూనివర్సిటీల చట్టాలను సమీక్షించి అతి త్వరలో ఏకీకృత చట్టాన్ని తీసుకురావాలని మంత్రి సూచించారు. ఇందులో గవర్నింగ్ బోర్డ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ, అకడమిక్ కౌన్సిల్ మొదలగు విభాగాలు ఉంటాయని మధుమూర్తి మంత్రికి వివరించారు. ఎప్ సెట్, లా సెట్, పిజి సెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్ణీత క్యాలెండర్ ప్రకారం నిర్వహిస్తున్నామని, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం కాలేజీలు ప్రారంభం అవుతాయని తెలియజేసారు. విద్యార్థుల నమోదు కై అపార్ ఐడి 98శాతం పూర్తిచేశామని, త్వరలో నూరుశాతం పూర్తిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఐఎస్ బి, ట్రిపుల్ ఐటి, ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ), సౌత్ ఏషియన్ యూనివర్సిటీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ అండ్ రీసెర్చి (నైపర్) ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో ఫారిన్ యూనివర్సిటీలు, ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులపై మంత్రి సమీక్షించారు. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న జాయింట్ సర్టిఫికేషన్ ఆఫ్ డిగ్రీస్ (జేసిడి) నిబంధనలను సడలించే అంశం పై చర్చించారు. నాణ్యత పై ఎటువంటి రాజీ లేకుండా ప్రైవేట్ కాలేజీలకు ఇచ్చే ఎన్ఓసి లు మరింత సులభతరంగా అందజేయాలని ఆదేశించారు. అలాగే ట్రిపుల్ ఐటి కనిగిరి ఏర్పాటు పై సమీక్షించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృతికా శుక్లా, కళాశాల విద్య డైరక్టర్ నారాయణ్ భరత్ గుప్తా, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, ఎపి స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సిఇఓ గణేష్ కుమార్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 103 ఎకరాల భూమి కబ్జా ఆరోపణలు అబద్ధం

**- సాక్షి, సోమిరెడ్డి రాజుకు సవాల్**

**- సాక్షి పేపరుపై మండిపడ్డ టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం**



**ఎస్.రాయవరం, జూన్ 6 (జనస్వరం) :** సాక్షి పత్రికలో తనపై చేసిన అసత్య ప్రచారంపై టీడీపీ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తీవ్రంగా స్పందించారు. ఈరోజు తన గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వాకపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని 103 ఎకరాల భూమిని తాను కబ్జా చేశానని, అడ్డువచ్చినవారిని బెదిరించానని సాక్షి పత్రిక అసత్య వార్తలు ప్రచురించిందని ఆరోపించారు. "ఈ కథనాన్ని సోమిరెడ్డి రాజు ప్రోత్సహించి ప్రచురింపజేశాడు. ఈ భూముల్లో ఒక్క సెంటు అయినా నాకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటాను. లేదంటే సాక్షి పత్రిక మూసివేయండి, సోమిరెడ్డి రాజు ఊరు వదిలిపెట్టు," అంటూ సవాల్ విసిరారు. సాక్షి పత్రికలో బాధితులుగా చూపించిన రైతులే తాము భూములు ఎవ్వరికీ ఇవ్వలేదని వాగ్మూలం ఇచ్చారని, కలెక్టర్ ఆఫీసుకు తమను తీసుకెళ్లి పాస్ పుస్తకాలు ఇప్పిస్తానని చెప్పి మోసగించినట్లు వారు మీడియా ముందు వివరించారని తెలిపారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా అసత్య వార్తలు ప్రచురించినందుకు సాక్షి పత్రికపై, సోమిరెడ్డి రాజుపై, దీనికి సహకరించిన వారిపై పరువు నష్టం దావా వేస్తానని ఆయన హెచ్చరించారు. అంతేకాక, "ఇప్పటికైనా సాక్షి పత్రిక అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిజాలు ప్రచురించే ధైర్యం చూపాలి," అని వ్యాఖ్యానించారు.

## ముగిసిన బాలల వేసవి శిక్షణ శిబిరం



**దెందులూరు, జూన్ 6 (జనస్వరం) :** మండలంలోని పోతునూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ గ్రంథ పాలకులు గ్రంథ పాలకులు గురిందపల్లి రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలు మే 28 నుండి జూన్ 6 వరకు జరుపబడి శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, పోతునూరు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు నున్న లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు జక్కుల జాన్ బాబు, రైతు సంఘం నాయకులు గండి రాజా, తెలుగు యువత అధ్యక్షులు పెట్ల బాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషికి పుస్తకానికి మించిన స్నేహితుడు ఉండడన్నారు. అందరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. తదుపరి వచ్చిన అతిథుల చేతుల మీదుగా వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలిచిన విద్యార్థులకు మెడల్స్ ను అందించారు. పాల్గొన్న విద్యార్థులకు అల్పాహారం (స్నాక్స్) అందించారు. ఈ కార్యక్రమం విజయవంతం అవ్వటానికి సహాయపడిన విద్యార్థుల తల్లిదండ్రులకు, గ్రామ పెద్దలకు, వచ్చిన అతిథులకు, గ్రంథ పాలకులు రాంబాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆదర్శ ఉపాధ్యాయునికి ఘనంగా వీడ్కోలు సన్మానం




**శంఖవరం, జూన్ 6 (జనస్వరం) :** విద్యను తపస్సుగా భావిస్తూ నాలుగు దశాబ్దాలపాటు విద్యా రంగానికి తన సేవల్ని అంకితం చేసిన ఆదర్శ ఉపాధ్యాయుడు చింతలపూడి కృష్ణార్జునుడికి శనివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వాకతిప్ప గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కృష్ణార్జునుడు తన బోధనా ప్రయాణాన్ని కొంతంగి నుంచి ప్రారంభించి, కత్తిపూడి, శంఖవరం, సీతాయంపేట, రాజుపాలెం, కొబ్బరిచెట్టుపేట, జగ్గంపేట, కందరాడ ప్రాంతాల మీదుగా చివరికి వాకతిప్పలో ముగించారు. ఆయన బోధన కేవలం పాఠశాల గదిలోనే పరిమితం కాకుండా విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకంగా నిలిచింది. మానవ విలువలు, నిజాయితీ, సమర్పణ భావన ఆయన బోధనలో ప్రతిఫలించాయని పలువురు గుర్తుచేశారు. "విద్యా యుద్ధంలో కృష్ణార్జును డిగా విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దిన ఆయన్ని పాఠశాల గోడలపై కాక, విద్యార్థుల హృదయాల్లో గుర్తుంచుకోవాలి" అని కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు భావోద్వేగంతో పేర్కొన్నారు. ఆయనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సహా అనేక పురస్కారాలు లభించినా, ఆయన గుండెల్లో నిలిచింది మాత్రం – విద్యార్థుల అభిమానమే. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ప్రత్యేకంగా ఘన సన్మానం చేశారు. జ్ఞాపికతో పాటు దుస్తులు అందజేశారు. విద్యా రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన సతీమణి గంగారత్నం ఆయనకు మౌనమైన శక్తిగా నిలిచారు. కుమారుడు వేంకట సురేష్, కుమార్తె సీతాలక్ష్మి, అల్లుడు శ్రీనివాస్, కోడలు రమ్యశ్రీ, మనుమలు హుతేష్, శ్రీహరిచంద్ర, నందన, కృష్ణ కార్తికేయ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వాక తిప్పలో చివరి పాఠం చెప్పిన రోజు విద్యార్థుల కళ్లలో ఆనంద బాష్పాలు మెరిపించాయి. "గురువు ఇక పాఠశాలకెళ్లరు అయినా, జీవితంలో ప్రతి అడుగులో ఆయన మార్గదర్శనం వుంటుంది" అనే భావం ప్రతీ విద్యార్థి మనసులో నాటుకుపోయింది. ఆయన జీవితం, బోధన, మానవతా భావన – ఈ తరం ఉపాధ్యాయులకు కూడా ప్రేరణగా నిలుస్తాయని పలువురు స్పష్టం చేశారు.

## విద్యా కుసుమానికి ప్రతిభా పురస్కారం

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి బొజ్జ కిరణ్ దీప్తికి ఘనత**



కొయ్యూరు, జూన్ 6 (జనస్వరం) : నర్సీపట్నం పట్టణంలోని కారుణ్య జూనియర్ కాలేజ్‌లో బైపీసీ (2023–2025) కోర్సు చదువుతున్న విద్యార్థి బొజ్జ కిరణ్ దీప్తి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాన్ని సాధించి ప్రతిభా అవార్డు పొందడం గర్వకారణంగా మారింది. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక, ప్రీ-యూనివర్సిటీ విద్యామండలి ప్రకటించిన ఫలితాల ప్రకారం ఆమె 1000కి 983 మార్కులు సాధించింది. ఈ ప్రతిభాపరమైన విజయంతో బొజ్జ కిరణ్ దీప్తి జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రావీణ్యాన్ని చూపింది. ఆమెకు ఈ ఘనత లభించడంతో కారుణ్య జూనియర్ కాలేజ్ యాజమాన్యం, అధ్యాపకవర్గం ఆమెను అభినందిస్తూ, ఈ విజయం వారి విద్యాసంస్థ ప్రతిష్ఠను మరింత పెంచిందని చెప్పారు. ఈ సందర్భంగా బొజ్జ కిరణ్ దీప్తి మాట్లాడుతూ, "నా విజయానికి మూలకారణం నా గురువులు, కుటుంబం, కాలేజ్ వాతావరణం. భవిష్యత్తులో మెడికల్ రంగంలో మంచి స్థాయికి చేరాలనే నా ఆశ ఉంది," అని అన్నారు. విద్యార్థుల కృషికి నిదర్శనంగా నిలిచే ఈ విజయగాథ ప్రస్తుత తరానికి ప్రేరణగా నిలుస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. కారుణ్య కాలేజ్ నుంచి ఇలాంటి ప్రతిభావంతుల వెలిసే విధంగా వాతావరణం కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

## కామ్రేడ్ పెరుమాలన్న ఆశయాలను కొనసాగిద్దాం

**టైలర్స్ కాలనీలో వర్ధంతి సభ**




**నెల్లూరు, జూన్ 6 (జనస్వరం) :** విప్లవ కమ్యూనిస్టు నేత, టైలర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు, కార్మిక వర్గాలకు మార్గదర్శిగా నిలిచిన కామ్రేడ్ మంచకులపాటి పెరుమాళ్లు వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం టైలర్స్ కాలనీలోని స్థూపం వద్ద సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐ.ఎఫ్.టీ.యూ, ప్రగతిశీల మహిళా సంఘం, పీడీఎస్‌యూ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టీ.యూ జిల్లా అధ్యక్షులు సీఎస్ సాగర్ మాట్లాడుతూ, "టైలర్స్ కాలనీ నిర్మాణం కోసం పెరుమాళ్లు చేసిన కృషి మరువలేనిది. కార్మికుల సంక్షేమం కోసం ఆయన శ్రమ అపారమైనది. రాష్ట్రవ్యాప్తంగా టైలర్ వర్గాల సమస్యలు పరిష్కరించేందుకు ముందుండి పోరాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి," అని పేర్కొన్నారు. ఈ సభలో పలు కార్మిక సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా మురళి, రేఖబాబు, షేక్ మదర్, గులాం, రీజెంట్ బాబు, శివాని సీనయ్య, కమురుద్దీన్, యానాదయ్య, బాలాజీ సీనయ్య, వేట మురళి వంటి నేతలు పాల్గొని కామ్రేడ్ పెరుమాలన్న సేవలను స్మరించుకున్నారు. పి.ఓ.డబ్ల్యూ నాయకులు వసంతమ్మ, సరోజినీ, శ్యామల, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం. సునీల్ తదితరులు విప్లవ నినాదాలతో పాల్గొని ఈ కార్యక్రమాన్ని మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దారు. "పెరుమాళ్ల అనుసరించిన విప్లవ మార్గమే కార్మికుల విముక్తి దారి. అదే పంథాలో నడవడమే మా బాధ్యత," అని సభ ముగింపులో సి.ఎస్.సాగర్ పేర్కొన్నారు.

## చిత్రావతి నదిపై రూ.29 లక్షలతో ఐదు స్నానపు గాట్ల నిర్మాణానికి భూమిపూజ

**పర్యాటకుల సౌకర్యార్థం చర్యలు ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



**పుట్టపర్తి, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పుట్టపర్తికి దేశ విదేశాల నుండి వచ్చే పర్యాటకులకు, భక్తులకు పవిత్ర చిత్రావతి నదిలో సౌకర్యవంతంగా స్నానం చేసే అవకాశం కల్పించేందుకు ఐదు స్నానపు గాట్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని శ్రద్ధా భక్తులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ గాట్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.29 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "భగవాన్ శ్రీ సత్యసాయి బాబా నడియాడిన పుణ్య భూమి అయిన చిత్రావతి నది తీరాన్ని పర్యాటక దృక్కోణంలో అభివృద్ధి చేసి, భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం," అన్నారు. స్నానపు ఘాట్లతో పాటు, బాబా శత జయంతి ఉత్సవాల నాటికి నది పరిసరాలను సుందరీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, మున్సిపల్ శాఖ అధికారులతో పాటు తెలుగు దేశం పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు రామ్ లక్ష్మణ్, బుక్కపట్నం మండల కన్వీనర్ మల్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ గంగాధర్, యూనిట్ ఇంచార్జ్ ఉమాపతి, రెండవ వార్డ్ ఇంచార్జ్ శేషు, పాపారెడ్డి తదితరులు హాజరయ్యారు. చిత్రావతి నది ప్రాశస్త్యం, సత్యసాయి ఆశ్రమానికి సమీపంలో ఉండటం వల్ల ఈ అభివృద్ధి చర్యలు భక్తులపై మక్కువ కలిగిస్తాయని, పర్యాటక ఆదాయం పెరగడానికి దోహదపడుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

**- పుట్టపర్తిని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేద్దాం**

**- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



**పుట్టపర్తి, జూన్ 6 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ప్రముఖ సాంత్వన దాత, కలియుగ ప్రత్యక్ష దైవం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల సమన్వయంతో ముందుకు సాగాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడం ముఖ్య ధ్యేయంగా కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ క్రమంలో జోయాలుకాస్ జ్యువలరీ సంస్థ ప్రతినిధులు కోటి రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ముందుకొచ్చినట్లు వెల్లడించారు. కార్పొరేట్ సంస్థలు తమ సామాజిక బాధ్యత నిధులను ప్రజల మేలు కోసమే వినియోగించాలంటూ పలు ప్రముఖ సంస్థలను అభ్యర్థించారని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో, జోయాలుకాస్ ప్రతినిధులతో పాటు టూరిజం, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "భగవాన్ సత్యసాయి బాబా నడయాడిన పుణ్యప్రదేశమైన చిత్రావతి నదిని అత్యంత సుందరీకరంగా అభివృద్ధి చేసి, ఫుట్‌పాత్‌లు, లైటింగ్‌లు, పార్కులు వంటి సదుపాయాలతో పర్యాటకులకు అద్భుతమైన అనుభూతి కలిగించేలా తీర్చిదిద్దుతాం" అని చెప్పారు. శతజయంతి ఉత్సవాల నాటికి అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆమె ఆదేశించారు. అంతేకాకుండా, పర్యాటకుల ఆహ్లాదకరమైన అనుభవం కోసం ప్రాంతంలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జోయాలుకాస్ సంస్థ ప్రతినిధులు తమ సహకారం అందించేందుకు సిద్ధమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.